వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక






హైదరాబాద్ | సంచిక : 52 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-




## సెప్టెంబర్ 30లోపు

# స్థానిక ఎన్నికలు జరపలేం

### సీఎం రేవంత్ రెడ్డి

-తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెర


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**ఢిల్లీ, -ప్రజా స్వేచ్ఛ**

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై కొనసాగుతున్న ఉత్కంఠకు తెర దించుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా స్థానిక ఎన్నికల అంశాన్ని ప్రస్తావించారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రకటన తెలంగాణ రాజకీయ వర్గాల్లో, అలాగే స్థానిక సంస్థల్లో పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధుల మధ్య చర్చకు దారితీసింది. గత కొద్ది రోజులుగా స్థానిక ఎన్నికల నిర్వహణపై తీవ్రమైన ఊహాగానాలు కొనసాగుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్, ఇతర పార్టీలు కూడా ఈ ఎన్నికల విషయంలో తమ తమ వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్న సమయంలో ముఖ్యమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి స్థానిక సంస్థల పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణకు సమయం సరిపోదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "స్థానిక ఎన్నికల నిర్వహణ అనేది ఒక విస్తృతమైన ప్రక్రియ. దీనికి చాలా సమయం పడుతుంది. ఎన్నికల కమిషన్, ప్రభుత్వ యంత్రాంగం కలిసి పనిచేయాలి. ఓటర్ల జాబితాల సవరణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, భద్రతా ఏర్పాట్లు వంటివి చాలా క్లిష్టమైన పనులు. ఈ మొత్తం ప్రక్రియకు అవసరమైన సమయం చాలా తక్కువగా ఉంది. అందుకే, సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించడం అసాధ్యం" అని తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం తగినంత సమాచారాన్ని, సన్నాహాలను సిద్ధం చేస్తుందని, ఎన్నికల కమిషన్‌తో చర్చలు జరుపుతామని సీఎం తెలిపారు. అయితే, ఎన్నికల షెడ్యూల్‌ను ఎప్పుడు ప్రకటిస్తారనే విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు కట్టుబడి ఉందని, కానీ సరైన సమయంలో, అన్ని సన్నాహాలు పూర్తైన తర్వాతే ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రకటన నేపథ్యంలో, స్థానిక సంస్థల పదవీకాలం ముగిసిన తర్వాత పరిపాలన ఎలా కొనసాగుతుంది అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం ఒక తాత్కాలిక ఏర్పాటును చేసే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్లను నియమించడం లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు, అధికార పార్టీకి ఎన్నికల సన్నాహాలకు మరింత సమయం లభించిందని, అలాగే విపక్షాలకు కూడా తమ తమ వ్యూహాలను మెరుగుపరుచుకోవడానికి అవకాశం లభించిందని చెబుతున్నారు. అయితే, ప్రజాస్వామ్య వ్యవస్థలో నిర్ణీత సమయంలో ఎన్నికలు నిర్వహించడం అవశ్యకమని, అందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉండాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేసే అవకాశం ఉంది. ఈ అంశంపై రాబోయే రోజుల్లో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశం ఉంది.





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

విలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 52 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | పేజీలు : 08 | వెల : రూ 10/-


## సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు

# అసాధ్యం

### కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదు

- కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలకు కవిత బలి
- కాళేశ్వరంపై సిబిఐ విచారణలో కిషన్ రెడ్డి మోకాలడ్డు
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేంవత్ రెడ్డి వ్యాఖ్యలు
- సీఎం తో భేటీ అయిన న్యూజెర్సీ గవర్నర్



**ఎమ్మెల్యేల వ్యవహారం పై స్పీకర్‌దే తుది నిర్ణయం**



**న్యూఢిల్లీ,**
స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక ఎన్నికలు జరపడం కష్టమని తెలిపారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపైనా స్పందించారు . కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు కాదని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత అంశంపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేల జీతాల నుంచి రూ.5000లు ఆ పార్టీకే వెళ్తుందని అన్నారు. నిధులు సైతం బీఆర్ఎస్‌కే వెళ్తున్నాయని తెలిపారు. అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రులు హరీష్‌రావు, కేటీఆర్ తమకు 37 మంది ఎమ్మెల్యేల బలం ఉందని, సమయం కేటాయించాలని కోరారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. -మిగతా 3 లో



## భారత్ మా ఆఫీసును కూల్చేసింది

- ఆపరేషన్ సింధూర్‌తో ముర్దిక్ స్థావరం ధ్వంసం..
- వీడియో షేర్ చేసిన లష్కరే కమాండర్

**ఇస్లామాబాద్ -**
ఆపరేషన్ సింధూర్ దాడి వల్ల పాకిస్థాన్‌లోని బహవల్‌పుర్‌లో ఉన్న జైషే ఉగ్రవాదుల ప్రధాన కార్యాయం ధ్వంసమైనట్లు కొన్ని రోజుల క్రితం జేషే మహమ్మద్ కమాండర్ ఇలియాస్ కశ్మీరీ పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు చెందిన వీడియో కూడా వైరల్ అయ్యింది. అయితే తాజాగా ఆ వ్యాఖ్యలను సమర్థిస్తూ లష్కరే తోయిబా ఉగ్రసంస్థ కూడా ఓ వీడియోను పోస్టు చేసింది. భారత సైన్యం జరిపిన దాడిలో ముర్దిక్‌లో ఉన్న లష్కరే తోయిబా ఉగ్ర స్థావరం ధ్వంసమైనట్లు ఆ ఉగ్ర సంస్థ కమాండర్ ఒకరు తెలిపారు.లష్కరే కమాండ్ ఖాసిమ్.. ఓ కూలిన ఇంటి వద్ద నిలుచుని మాట్లాడుతున్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ముర్దిక్‌లో శిథిలమైన మర్కాజ్ ఈ తాయిబా క్యాంపు వద్ద అతను తన బాధను పంచుకున్నాడు. ముజాహిదిన్ ఉగ్రవాదులు ఇక్కడే శిక్షణ -మిగతా 3 లో



## పాక్‌కు అమెరికా షాక్

- బలూచ్ ఆర్మీని ఉగ్రసంస్థగా ప్రకటించాలన్న అభ్యర్థనను అడ్డుకున్న అగ్రరాజ్యం

**న్యూఢిల్లీ,**
దాయాది పాకిస్థాన్ కు అగ్రరాజ్యం అమెరికా షాకిచ్చింది. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ , దానికి చెందిన మజీద్ బ్రిగేడ్ ని విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తించాలంటూ యూఎన్ భద్రతామండలిలో చైనా,పాక్ చేసిన అభ్యర్థనను అమెరికా అడ్డుకుంది.బలూచ్ ఆర్మీ, మజీద్ బ్రిగేడ్‌పై ఆంక్షలు విధించాలంటూ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో పాక్-చైనా ఉమ్మడి బిడ్‌ను సమర్పించాయి. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితిలో పాకిస్థాన్ శాశ్వత ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. అల్ ఖైదా, తెహ్రీక్ ఇ తాలిబన్ పాకిస్థాన్, బలోచ్ ఆర్మీ, మజీద్ బ్రిగేడ్ సహా పలు ఉగ్రవాద గ్రూపులు ఆఫ్ఘనిస్థాన్ కేంద్రంగా తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఉద్భవిస్తున్న ఉగ్రవాదం పాక్ ప్రాథమిక జాతీయ భద్రతకు ముప్పుగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ అభ్యర్థన మేరకు ఆ ఉగ్రసంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే, పాక్-చైనా చేసిన ఈ అభ్యర్థనను యూఎస్, యూకే, ఫ్రాన్స్ అడ్డుకున్నాయి. -మిగతా 3 లో

## ఒక్కరోజులో 404 కేసులను ఎలా విచారిస్తారు?

- కేసులను త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశం మంచిదే
- సమాచార కమిషన్‌ను నిలదీసిన తెలంగాణ హైకోర్టు




**హైదరాబాద్, - ప్రజా స్వేచ్ఛ**
: కేసులను త్వరగా పరిష్కరించాలన్న ఉద్దేశం మంచిదే అయినా ఒకరోజు 404 కేసులను ఎలా విచారిస్తారని సమాచార కమిషన్ ను హైకోర్టు నిలదీసింది. 404 అప్పీళ్లకు సంబంధించిన ఫైళ్లతో పిటిషనర్ ఎలా రాగలరని ప్రశ్నించింది. కేసుల నంబర్లు లేకుండా విచారణకు హాజరు కావాలంటూ ఇచ్చిన నోటీసు చెల్లదని పేర్కొంది. సమాచారం హక్కు చట్టం కింద కోరిన సమాచారానికి సంబంధించి సహ -మిగతా 3 లో

## తుమ్మడిహట్టి పై హరీష్ అబద్ధాలు


- అంచనాలే వేయకుండానే బడ్జెట్ లెక్కల
- అతి తెలివితేటలు వద్దని ఉత్తమ్ ఎద్దేవా



**హైదరాబాద్ - ప్రజా స్వేచ్ఛ**
తుమ్మడిహట్టి బ్యారేజ్, చేవెళ్ల-ప్రాణాహిత బ్యారేజ్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని,. అయితే ఇప్పటి వరకు అంచనాలపై ఎలాంటి లెక్కలు సిద్ధం చేయలేదని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. దీనిపై అబద్దపు లెక్కలు కట్టిన హరీష్ రవు తీరుపై మంత్రి మండిపడ్డారు. మాజీ మంత్రి హరీష్ రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. తుమ్మడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి రూ.35 వేల కోట్లు ఖర్చు అవుతుందని, 4.47 లక్షల ఎకరాలకు ఆయకట్టు అందుతుందని హరీష్ రావు చేసిన ప్రకటన అసత్యమని ఆయన స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితిలో హరీష్ రావు అంచనాలు ఎలా చెబుతారు? -మిగతా 3 లో

# ఎమ్మెల్యేలను దొంగిలించడం నేరం కాదా?

### ఓట్ల చోరీ కంటే ఎమ్మెల్యేల చోరీ పెద్దది



- దమ్ముంటే వారితో రాజీనామాలు చేయించాలి
- రాహుల్ గాంధిది రెండు నాల్కల ధోరణి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, - ప్రజా స్వేచ్ఛ**
ఓట్ చోరి కంటే ఎమ్మెల్యేల చోరి పెద్ద నేరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యేల చోరిపై మాట్లాడకపోవడం రాహుల్ రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని.. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయిస్తేనే ఓట్ చోరిపై మాట్లాడే నైతిక అర్హత ఉంటుందన్నారు. ఓట్ చోరీపై గొంతు చించుకుంటున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, తెలంగాణలో తమ పార్టీ చేసిన ఎమ్మెల్యేల చోరీపై ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఓట్ల చోరీ ఒక నేరమైతే, ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేలను దొంగిలించడం అంతకంటే పెద్ద నేరమని, అది ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు ఖూనీ చేయడమేనని -మిగతా 3 లో



## చిక్కుల్లో రాహుల్‌గాంధీ

- ఎన్నికల కమిషనర్‌పై ఆరోపణలు

**న్యూఢిల్లీ, -**
ఓట్ల చోరీపై నిర్వహించిన ప్రెస్ మీట్‌తో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చిక్కుల్లో పడ్డారు. దేశంలో ఓట్ల చోరీపై ఢిల్లీలోని కాంగ్రెస్ కేంద్ర కార్యాలయం ఇందిరా భవన్‌లో రాహుల్ విలేకరుల సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ మీటింగ్‌లో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఓటు దొంగలను, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేస్తున్న వ్యక్తులను ఆయన రక్షిస్తున్నారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఓట్ల తొలగింపునకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. కర్ణాటకలోని ఆలంద్, మహారాష్ట్రలోని రజోరా నియోజకవర్గాల్లో ఇలాంటి ఘటనలు -మిగతా 3 లో

## నగరంలో కురుస్తున్న వర్షాలతో అప్రమత్తం

- వచ్చే మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలి
- అధికారులతో మంత్రి పొన్నం టెలీకాన్ఫరెన్స్



**హైదరాబాద్,- - ప్రజా స్వేచ్ఛ**
:నగరంలో కురుస్తున్న భారీ వర్షాలు.. తీసుకుంటున్న చర్యలపై జిహెచ్‌ఎంసి, హైడ్రా, పోలీస్, ట్రాఫిక్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్, జిల్లా రెవెన్యూ, విద్యుత్, హెల్త్ వివిధ విభాగాల అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో తక్కువ సమయంలో ఎక్కువ వర్షం కురుస్తుండటం వల్ల ప్రజల ఇబ్బందులు పడుతుండడంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వచ్చే మూడు రోజుల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలతో అధికారులు విధుల్లో ఉండాలని -మిగతా 3 లో

## ఇండియా, మోదీ నాకు మంచి సన్నిహితులే

- మీడియా సమావేశంలో డోనాల్డ్ ట్రంప్




**లండన్-**
వాణిజ్య యుద్ధం నేపథ్యంలో అమెరికా, భారత్ మధ్య సంబంధాలు బలహీనపడ్డ విషయం తెలిసిందే. అయితే ప్రధాని మోదీపై మాత్రం ట్రంప్ తన ప్రశంసలను ఆపడం లేదు. ప్రధాని మోదీకి తాను సన్నిహితంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. సెప్టెంబర్ 17వ తేదీన మోదీ బర్త్‌డే సందర్భంగా ఆయనతో ఫోన్‌లో మాట్లాడినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇండియాకు చాలా దగ్గరగా ఉన్నానని, ప్రధాని మోదీ కూడా తనకు దగ్గరి వ్యక్తే అని, ఫోన్‌లో మాట్లాడి బర్త్‌డే విషెస్ చెప్పినని, తమ మధ్య మంచి సంబంధాలు ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు పేర్కొన్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రంప్ ఈ విషయాన్ని చెప్పడం గమనార్హం.రష్యా వద్ద ఇంధనం కొంటున్న భారత్‌పై అదనపు సుంకాలు విధిస్తున్నట్లు ఇటీవల ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. -మిగతా 3 లో

## కాంగ్రెస్‌లో చేరలేదు, కలిసి పనిచేస్తున్నా..

### రాజకీయాలను కేసీఆర్ భ్రష్టు పట్టించారు

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే..
- పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందెవరు?
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**హైదరాబాద్,**
తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల్లో ఒకరైన స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన కామెంట్స్ చేశారు. హన్మకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కడియం మాట్లాడుతూ బీఅర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో 36 మంది శాసన సభ్యులను పార్టీలో చేర్చుకొని అందులో ఇద్దరికీ మంత్రి పదవి కూడా ఇచ్చారని కడియం శ్రీహరి గుర్తు చేశారు. రాష్ట్రంలో అధికారంలో -మిగతా 3 లో

# గుంతల వల్ల మరణిస్తే మున్సిపాల్టీదే బాధ్యత

**అధికారుల జీతాల నుంచి పరిహారం రాబట్టాలి**
**కాంట్రాక్టర్లను బాధ్యులను చేయాలి**
**బాంబే హైకోర్టు సంచలన ఆదేశాలు**
**గుంతల వల్ల రోడ్డు ప్రమాదాలపై సుమోటోగా కేసు విచారణ**





**ముంబై, ప్రజా స్వేచ్ఛ**
రోడ్లపై గుంతల కారణంగా జరిగే ప్రమాదాలకు మున్సిపల్ కార్పొరేషన్లను బాధ్యుల్ని చేస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం ఓ విధానాన్ని రూపొందించగలదా అని బాంబే హైకోర్టు ప్రశ్నించింది. రోడ్ల దుస్థితి కారణంగా సంభవించే మరణాలు లేదా అయ్యే గాయాలకు పురపాలక సంస్థలు, అధికారులను బాధ్యుల్ని చేయాలని హైకోర్టు స్పష్టం చేసింది. రోడ్లపై గుంతల వల్ల జరిగే ప్రమాదాల బాధితులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఓ విధానాన్ని రూపొందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమో కాదో తెలుసుకుని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాది ఓఎస్ చందూర్కర్‌ని జస్టిస్ రేవతీ మొహితే, జస్టిస్ సందేశ్ బీ పాటిల్‌తో కూడిన హైకోర్టు ధర్మాసనం గురువారం ఆదేశించింది. మున్సిపల్ కార్పొరేషన్లను బాధ్యుల్ని చేయాలని, మున్సిపల్ అధికారుల జీతాల నుంచి పరిహారాన్ని రాబట్టాలని ధర్మాసనం తెలిపింది. చిన్న జరిమానా సరిపోదని, వారికి కూడా నొప్పి తెలియాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రోడ్లపై గుంతల కారణంగా సంభవిస్తున్న మరణాలపై సుమోటోగా హైకోర్టు విచారణ చేపట్టింది. రోడ్ల దుస్థితికి కాంట్రాక్టర్లను కూడా జవాబుదారీగా చేయాలని ముంబై మెట్రోపాలిటన్ రీజియన్‌లోని అన్ని పురపాలక సంస్థలతోపాటు బీఎంసీని కూడా ధర్మాసనం ఆదేశించింది. కాంట్రాక్టర్లకు రూ. 1 లక్ష నుంచి రూ. 10 లక్షల వరకు జరిమానాలు విధించినట్లు న్యాయవాది తెలియచేయగా కోట్లాది రూపాయల కాంట్రాక్టులు పొందుతున్న వారికి ఈ జరిమానాలు సరిపోవని, వారికి భారీగా జరిమానాలు విధించాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. తాము విస్తృతమైన అంశంగా ఈ సమస్యను పరిగణిస్తున్నామని, గుంతల కారణంగా ఏ వ్యక్తయినా మరణించడం లేదా గాయపడడం సంభవిస్తే అందుకు ఎవరు బాధ్యులని న్యాయమూర్తులు ప్రశ్నించారు. ఈ విషయంలో జవాబుదారీతనం ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

# మరో 474 పార్టీలపై ఈసీ వేటు



**న్యూఢిల్లీ,- ప్రజా స్వేచ్ఛ**
: దేశంలోని చిన్నాచితకా పార్టీలకు భారత ఎన్నికల సంఘం మరోసారి షాకిచ్చింది. గత ఆరేండ్లుగా ఎన్నికల్లో పోటీ చేయకపోవడం సహా, నిబంధనలు పాటించని, గుర్తింపు లేని, నమోదైన 474 పార్టీలను జాబితా నుంచి తొలగిస్తున్నట్టు శుక్రవారం ప్రకటించింది. కాగా, ఈసీ ఆగస్టు 9న మొదటి విడతగా చేపట్టిన ఈ కార్యక్రమంలో 334 నమోదై, గుర్తింపులేని పార్టీ (ఆర్‌యూపీపీ) లను తొలగించిన సంగతి తెలిసిందే. దానికి కొనసాగింపుగా 474 పార్టీలను కూడా తాజాగా తొలగించామని, మొత్తం రెండు నెలల కాలంలో 808 ఆర్‌యూపీపీలను జాబితా నుంచి తీసివేశామని తెలిపింది. ఇప్పటివరకు దేశంలో 2,520 ఆర్‌యూపీపీలు ఉండగా, తాజా తొలగింపు తర్వాత వాటి సంఖ్య 2,046కు చేరుకుంది. ఇవికాక, ఆరు గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, 67 రాష్ట్ర పార్టీలు ఉన్నట్టు ఈసీ వివరించింది.


# ఒడిశాలో బాలికపై గ్యాంగ్ రేప్.. మరో బాలికపై లైంగిక వేధింపులు



**రూర్కెలా - ప్రజా స్వేచ్ఛ**
బీజేపీ పాలిత ఒడిశాలో వరుస గ్యాంగ్‌రేప్ ఘటనలు కలకలం రేపుతున్నాయి. తాజాగా ఇద్దరు యువకులు ఒక బాలికపై సామూహిక లైంగిక దాడికి తెగబడ్డారు. మరొక బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. పోలీసుల కథనం ప్రకారం బాధితులు మరో ఇద్దరితో కలిసి బర్సుయాన్‌లో విశ్వ కర్మ పూజ చూసి ఒక వాహనంలో నిర్జన అటవీ ప్రాంతం గుండా ఇంటికి తిరిగి వస్తుండగా బుధవారం రాత్రి ఈ ఘటన జరిగింది. ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్టు డీఐజీ(పశ్చిమ రేంజ్) బ్రిజేశ్ కుమార్ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం కె బలంగ్ ప్రాంతానికి చెందిన బాధితుల వాహనాన్ని నిందితులు అడ్డగించి అందులోని వారిని భయభ్రాంతుల్ని చేశా రు. ఆ తర్వాత బాధితులపై దగ్గర్లోని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడ్డారు.

# పాక్‌లో ఉంటే సొంతింట్లో ఉన్న ఫీలింగ్

**కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ చైర్మన్ శామ్ పిట్రోడా మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశ విదేశాంగ విధానం మారాలని, పాకిస్థాన్‌పైన మొదట దృష్టి సారించాలని ఆయన ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పిలుపునిచ్చారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్‌ను సందర్శించిన ప్రతిసారి తనకు సొంత ఇంట్లో ఉన్నట్లు ఉంటుందని ఆయన వ్యాఖ్యానించారు. ఈ మూడు దేశాలు కొంతకాలం అలజడి తర్వాత పాలనాపరమైన మార్పులకు లోను కావడం ఆసక్తికరం. హింస, ఉగ్రవాదం వంటి సమస్యలు ఉన్నప్పటికీ పాక్, బంగ్లాదేశ్‌తో భారత్ చర్చలు జరపాలని పిట్రోడా సూచించారు. ఈ ఏడాది ఏప్రిల్ 22న జమ్ము కశ్మీరులోని పహల్గాంలో 25 మంది పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపిన నేపథ్యంలో పాకిస్థాన్‌తో సంబంధాలు మెరుగుపరుచుకోవాలని పిట్రోడా పిలుపునివ్వడం గమనార్హం. ఆసియా కప్‌లో పాకిస్థాన్‌తో తలపడేందుకు భారత క్రికెట్ జట్టుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో పిట్రోడా వ్యాఖ్యలు కాంగ్రెస్‌ను ఇరకాటంలోకి నెట్టే అవకాశం ఉంది.

# హాఫీజ్‌ను కలిసినందుకు మన్మోహన్ సింగ్ థ్యాంక్స్ చెప్పారు


**ఉగ్రవాది యాసిన్ మాలిక్ సంచలన ప్రకటన**



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
ఉగ్రవాదులకు నిధులు సమకూర్చారన్న కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న జమ్ము కశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ ఉగ్రవాది యాసిన్ మాలిక్ సంచలన విషయాన్ని వెల్లడించారు. లష్కరే తాయిబా వ్యవస్థాపకుడు, 26/11 సూత్రధారి హాఫీజ్ సయీద్‌ను తాను 2006లో కలిసిన తర్వాత నాటి ప్రధాని మన్మోహన్ తనకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారని గత నెల 25న ఢిల్లీ హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో మాలిక్ పేర్కొన్నారు. పాకిస్థాన్‌తో తెర వెనుక శాంతి ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భారత సీనియర్ నిఘా అధికారులు కోరడంతో తాను అతడిని కలిశానని వెల్లడించారు. మాలిక్ ప్రకటన ప్రకారం నాటి నిఘా విభాగం ప్రత్యేక డైరెక్టర్ వీకే జోషి ఢిల్లీలో మాలిక్‌ను కలిసి పాకిస్థాన్ పర్యటనలో రాజకీయ నాయకులతో పాటు సయీద్ తదితర ప్రముఖ ఉగ్రవాదులను కలిసి ప్రధాని మన్మోహన్ సింగ్ చేస్తున్న శాంతి ప్రయత్నాలకు మద్దతు కూడగట్టాలని కోరారు. దాంతో తాను పాకిస్థాన్‌లోని ప్రముఖ ఉగ్రవాదులతో హింసపై సయోధ్య కోసం ఒత్తిడి చేశానని మాలిక్ తెలిపారు. అధికారికంగా ఆమోదించిన ఈ చొరవను ఆ తర్వాత రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించారని చెప్పారు.

# పాక్-సౌదీ ఒప్పందంలో మరిన్ని దేశాలు..

**-పాక్ రక్షణ మంత్రి ఆసిఫ్ వ్యాఖ్యలు**
**-మా అణు సంపద సౌదీకి ఉపయోగం**



**న్యూఢిల్లీ, - ప్రజా స్వేచ్ఛ**
పాకిస్థాన్, సౌదీ అరేబియా మధ్య కుదిరిన పరస్పర రక్షణ ఒప్పందంలో ఇతర అరబ్ దేశాలు కూడా చేరే అవకాశం లేకపోలేదని పాక్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ తెలిపారు. అటువంటి పరిణామాలకు తలుపులు మూసుకుపోలేదంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఒక దేశంపై దాడి జరిగితే రెండు దేశాల మధ్య జరిగిన దాడిగా పరిగణించే పరస్పర రక్షణ ఒప్పందాన్ని పాకిస్థాన్, సౌదీ అరేబియా బుధవారం కుదుర్చుకున్నాయి. ఒకరోజు పర్యటన నిమిత్తం బుధవారం సౌదీ అరేబియాను సందర్శించిన పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, సౌదీ యువరాజు మొహమ్మద్ బిన్ సల్మాన్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఖతార్‌లో హమాస్ నాయకులపై ఇజ్రాయెల్ సైనిక దాడులు జరిపిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. పరస్పర రక్షణ ఒప్పందంలో మరిన్ని అరబ్ దేశాలు భాగస్వాములయ్యే అవకాశం ఉందా అన్న విలేకరుల ప్రశ్నకు తాను దీనికి ఇప్పుడే సమాధానం చెప్పలేనని, అయితే తలుపులు మాత్రం మూసుకుపోలేదని మాత్రం కచ్చితంగా చెప్పగలనని ఆసిఫ్ చెప్పారు. పాకిస్థాన్‌కు ముప్పు ఎక్కువగా ఉన్న కారణంగా ఇస్లామిక్ దేశాల మధ్య నాటో తరహా ఏర్పాటు ఉండాలని తాను మొదటినుంచి వాదిస్తున్నట్లు మంగళవారం జియో న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసిఫ్ చెప్పారు. తమ ప్రాంతాన్ని, దేశాలను సమైక్యంగా పరిరక్షించుకోవలసిన ప్రాథమిక హక్కు ముస్లిం దేశాలకు, ముఖ్యంగా ముస్లిం ప్రజలకు ఉందని ఆయన తెలిపారు. ఇతర దేశాల ప్రవేశాన్ని అడ్డుకోవడం లేక మరే ఇతర దేశంతో పాకిస్థాన్ ఈ తరహా ఒప్పందం కుదుర్చుకోరాదన్న నిబంధన ఏదీ రెండు దేశాలు చేసుకున్న ఒప్పందంలో లేదని ఆయన స్పష్టం చేశారు. ఒప్పందం కింద పాకిస్థాన్ అణ్వస్త్రాలు కూడా సౌదీకి ఉపయోగపడతాయా అన్న ప్రశ్నకు తమకు ఉన్న సమస్త ఆయుధ సంపత్తి ఒప్పందం కింద సౌదీకి కూడా కచ్చితంగా అందుబాటులో ఉంటుందని ఆసిఫ్ వెల్లడించారు. తమ అణు స్థావరాలను తనిఖీ చేసుకోవచ్చని పాక్ మొదటి నుంచి ఆహ్వానిస్తోందని, తమ దేశం ఎన్నడూ ఏ తప్పు చేయలేదని ఆయన చెప్పారు. మీ రెండు దేశాలలో ఒక దేశంపై దాడి జరిగితే మరో దేశం స్పందిస్తుందా అన్న ప్రశ్నకు అందులో ఎటువంటి అనుమానం ఉండదని, తమలో ఎవరిపైన దాడి జరిగినా మరో దేశం స్పందిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# మణిపూర్‌లో అస్సాం రైఫిల్స్ కాన్వాయ్‌పై దాడి

**ఇద్దరు జవాన్లు మృతి ఐదుగురికి గాయాలు**



**ఇంఫాల్,- ప్రజా స్వేచ్ఛ**
మణిపూర్‌లో ఆర్మీ కాన్వాయ్‌పై ఒక వ్యక్తి జరిపిన మెరుపుదాడిలో ఇద్దరు జవాన్లు మరణించారు. రాజధాని ఇంఫాల్ నుంచి బిష్ణుపూర్‌కు వెళ్తున్న 33 అస్సాం రైఫిల్స్ జవాన్లపై నంబోల్ సకల్ లీకై వద్ద శుక్రవారం సాయంత్రం ఒక గుర్తు తెలియని వ్యక్తి ఆకస్మికంగా దాడిచేసి కాల్పులు జరిపాడు. ఈ దాడిలో ఇద్దరు మరణించగా, ఐదుగురు గాయపడ్డారు. వారిని సమీపంలోని దవాఖానకు తరలించారు. దాడిని మణిపూర్ గవర్నర్ అజయ్ కుమార్ భల్లా తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించారు. దారుణమైన ఈ హింసాత్మక చర్యలను ప్రభుత్వం సహించదని హెచ్చరించారు. దాడిని మాజీ సీఎం బీరేన్ సింగ్ ఖండించారు. ఇది రాష్ట్రానికి క్రూరమైన దెబ్బగా పేర్కొన్నారు.

# ఓట్లను చోరీ చేసేవారిని కాపాడే 'ఎన్నికల కాపలాదారు' ఈసీ



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
ఎలక్షన్ కమిషన్ (ఇసి)పై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ 'ఓట్‌చోరీ' వ్యాఖ్యలను శుక్రవారం పునరుద్ఘాటించారు. ఓట్లను దొంగతనం చేసేవారిని ఇసి కాపాడుతోందని, 'ఎన్నికల కాపలాదారు' అని మండిపడ్డారు. 'మెలకువగా ఉండి, దొంగతనాన్ని గమనించి, దొంగలకు భద్రత కల్పించడం' వారి పని అని అన్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు లేవడం, 36 సెకండ్లలో ఇద్దరు ఓటర్ల పేర్లను తొలగించడం, తిరిగి నిద్రలోకి వెళ్లడం ఈ విధంగా ఓట్ చోరీ జరుగుతోందని ఎక్స్‌లో పేర్కొన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలోని అలంద్ నియోజకవర్గంలో 6,018 ఓట్లను తొలగించారని, అలాగే మహారాష్ట్రలోని రాజౌరా నియోజకవర్గంలో ఆటోమేటెడ్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి 6,850 ఓట్లను మోసపూరిత పద్ధతిలో చేర్చారని అన్నారు. అదే వ్యవస్థ పనిచేస్తోందని, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో కూడా ఓట్లను తొలగిస్తోందని, దానికి సాక్ష్యాలు ఉన్నాయని అన్నారు. మీరు ఎన్నికల అధికారిగా బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తానని ప్రమాణం చేశారని, మీ విధులు సక్రమంగా నిర్వహించాలని భారతదేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌కి సూచించారు. సాకులు వెతుకుతూ, తప్పించుకు తిరగడం ఆపాలని, కర్ణాటక సిఐడికి వెంటనే ఆధారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వం సెక్యులర్‌గా వ్యవహరిస్తుంది:



**న్యూఢిల్లీ - ప్రజా స్వేచ్ఛ**
మైసూరు దసరా ఉత్సవాల ప్రారంభోత్సవానికి ముస్లిం రచయిత్రి బాను ముష్తాక్‌ను ఆహ్వానించడంపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు భారత రాజ్యాంగ పీఠికలోని లౌకికవాదం, ఆలోచన, విశ్వాసాల్లో స్వేచ్ఛ, సమానత్వం అనే ఆదర్శాలను గుర్తు చేసింది. ఇది ప్రభుత్వ కార్యక్రమం కాబట్టి ప్రభుత్వానికి ఒక మతం ఉండదని, అన్ని మతాల పట్ల సమానంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేసింది. లౌకికవాదం అనేది భారత రాజ్యాంగంలోని మౌలిక అంశమని మరోసారి నొక్కి చెప్పింది.

## భారత్ మా ఆఫీసును కూల్చేసింది

పొందినట్లు అతను స్పష్టం చేశాడు. మర్కాజ్ తాయిబా ముందు నిలుచున్నానని, ఆపరేషన్ సింధూర్ దాడిలో ఇదిధ్వంసమైందని, మళ్లీ దీన్ని నిర్మిస్తామని, మరింత పెద్దగా కడుతామని, ముజాహిద్దీన్‌లో ఎక్కువ మంది ఇక్కడే శిక్షణ పొందారని, వాళ్లు విజయం సాధించారని లష్కరే కమాండర్ పేర్కొన్నారు. దైరా–ఈ–సూపా కార్యక్రమం కింద యువత తమ దళంలో చేరాలని ఆయన పిలుపునిచ్చారు. పంజాబ్ ప్రావిన్సులోని నంగల్ సహదాన్‌లో 2000 సంవత్సరంలోమార్కాజ్ తాహిబాను నిర్మించారు. వరద సహాయం పేరుతో లష్కరే తోయిబా నిధులను సమీకరిస్తున్నది. హాఫీజ్ సయిద్ నేతృత్వంలో ఈ ఫండ్ కలెక్షన్ జరుగుతున్నట్లు కొన్ని సంస్థల ద్వారా తెలుస్తోంది.

## పాక్‌కు అమెరికా షాక్

ఈ గ్రూపులను ఉగ్ర సంస్థలుగా గుర్తించడానికి తగిన ఆధారాలు లేవని పేర్కొన్నాయి.కాగా, పాకిస్థాన్ ఆర్మీ ఫీల్డ్ మార్షల్ సయ్యద్ అసిం మునీర్ పర్యటన వేళ.. బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ , దానికి చెందిన మజీద్ బ్రిగేడ్ ను విదేశీ ఉగ్రవాద సంస్థలుగా గుర్తిస్తూ అమెరికా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. బీఎల్‌ఏని 2019లోనే.. 'స్పెషల్లీ డెజిగ్నేటెడ్ గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డీజీటీ)' జాబితాలో చేర్చిన అమెరికా.. మజీద్ బ్రిగేడ్‌ను కూడా బీఎల్‌ఏలో భాగంగానే భావిస్తున్నట్టు ప్రకటించింది. ఈ మేరకు యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో గతనెల కీలక ప్రకటన చేశారు.ఇటీవలే కాలంలో బీఎల్‌ఏకు చెందిన మజీద్ బ్రిగేడ్ పాక్‌లోని పలు ప్రాంతాల్లో వరుస దాడులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. పాక్ సైన్యమే లక్ష్యంగా ఆత్మాహుతి దాడులు నిర్వహిస్తోంది. 2024లో కరాచీ ఎయిర్‌పోర్ట్, గ్వాదర్ పోర్ట్ అథారిటీపై బీఎల్‌ఏ దాడులు చేపట్టింది. ఇక ఈ ఏడాది అంటే 2025లో జాఫర్ ఎక్స్‌ప్రెస్ హైజాక్ చేసి దాదాపు 300 మంది ప్యాసింజర్లను బందీలుగా చేసుకుంది. పాక్ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి వారిని విడిపించింది. ఈ రైలు హైజాక్ ఘటనలో 31 మంది పౌరులు, పాక్ సైనికులు చనిపోయారు. ఇలా వరుస దాడులతో బలూచ్ ఆర్మీని ఉగ్రసంస్థగా గుర్తించాలని పాక్ కోరుతూ వస్తోంది.

### ఒక్కరోజులో 404 కేసులను

## ఎలా విచారిస్తారు?

కార్యకర్త వి.శ్యామ్ కమిషన్ ముందు 404 అప్పీళ్లు దాఖలు చేశారు. వీటన్నింటిపై విచారణకు వివరాలతో ఈ నెల 18న హాజరు కావాలని కమిషన్ నోటీసులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ శ్యామ్ గురువారం లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేయగా, జస్టిస్ టి.మాధవీ దేవి విచారించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ సమాచార కమిషన్ చీఫ్ కమిషనర్ పోస్టు ఏడాదిన్నర పాటు ఖాళీ ఉండటంతో 17 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పిటిషనర్ 404 అప్పీళ్లు దాఖలు చేయగా, మరో ఇద్దరు 980, 832 చొప్పున దాఖలు చేశారన్నారు. వీటిలో కొన్నింటిని గడువులోగా పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని, అందులో భాగంగానే పిటిషనర్‌కు నోటీసు జారీ చేశారని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఒకేరోజు 404 కేసులపై విచారణ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ఈ నెల 11న ఇచ్చిన నోటీసును రద్దు చేస్తున్నామని, కేసుల వివరాలతో తాజాగా ఇవ్వాలని కమిషన్‌కు ఆదేశిస్తూ పిటిషన్‌పై విచారణను మూసివేసింది.స.హ.చట్టం కింద సమాచారం కోసం ముగ్గురు అర్జీదారులు అప్పిలేట్ అథారిటీకి వందల కొద్దీ దరఖాస్తులు సమర్పించారు. పురపాలక, ఆర్థిక, రెవెన్యూ శాఖల్లో వేసినట్లు రాష్ట్ర సమాచార కమిషన్ గుర్తించింది. స.హ.చట్టం కింద సరైన సమాచారం రాకుంటే అప్పిలేట్ అథారిటీకి దరఖాస్తు చేయొచ్చు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు వేర్వేరు జిల్లాల్లోని పలు విభాగాల పరిధిలో దాదాపు 2,500 దరఖాస్తులు చేశారు. గురువారం ఇక్కడ ఆర్టీఐ కార్యాలయంలో ప్రధాన సమాచార కమిషన్ నేతృత్వంలోని ఐదుగురు కమిషనర్ల ఆధ్వర్యంలోని పూర్తిస్థాయి బెంచ్ వీటిపై విచారించింది. 2023 చివరి వరకు శ్రీనివాస్ రెడ్డి ఆర్థికశాఖ బడ్జెట్, ఖర్చుల వివరాలపై సమాచారం తీసుకున్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మరో దరఖాస్తుదారుడు వడ్డే శ్యామ్ పురపాలక శాఖ చార్మినార్ జోన్ పరిధిలో ఎన్ని భవనాలకు నిర్మాణ అనుమతులిచ్చారు? ఎందరికి నివాస యోగ్యతపత్రాలు మంజూరు చేశారన్న విషయాలపై సమాచారం కోరినట్లు వివరించింది. మహ్మద్ అష్రఫ్ పాఠశాల విద్య, హోం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమాచారం అడిగారని పేర్కొంది.

## తుమ్మడిహట్టి పై హరీష్ అబద్ధాలు

(మొదటి తరువాయి)

ఇది ఆయన అతితెలివి తేటలకు అద్దం పడుతున్నట్లే అని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హరీష్ రావు చేస్తున్న 35 వేల కోట్ల వ్యయం, 4.47 లక్షల ఎకరాల ఆయకట్టు– ప్రకటనలు అవాస్తవమని, ఇవి పూర్తిగా ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశ్యంతోనే చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసిన వెంటనే అధికారికంగా ప్రకటిస్తుంది. కానీ హరీష్ రావు లాంటి నేతలు అసత్య ప్రచారం చేయడం తగదు. తెలంగాణ సమాజం ఇలాంటి వ్యాఖ్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి' అని మంత్రి హెచ్చరించారు. తన ప్రభుత్వం పారదర్శకంగా పనిచేస్తుందని, ముఖ్యంగా రైతు సంక్షేమం పట్ల కట్టు–బడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి హామీ ఇచ్చారు. సాగునీరు, త్రాగునీరు అందించేందుకు ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేస్తున్నామని ఆయన తెలిపారు.

## చిక్కుల్లో రాహుల్‌గాంధీ

(మొదటి తరువాయి)

జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రెస్ మీట్‌లో ఓట్లు ఎలా చోరీకి గురవుతున్నాయో వివరిస్తూ ఓ ఫోన్ నంబర్‌ను రాహుల్ ప్రదర్శించారు. అది ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన అంజనీ మిశ్రా అనే వ్యక్తి ఫోన్ నంబర్. రాహుల్ ప్రెస్ మీట్ తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ కాల్స్ వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై అంజనీ మిశ్రా అసహనం వ్యక్తం చేశారు. రాహుల్ ప్రెస్ మీట్ తర్వాత దేశం నలుమూలల నుంచి నిరంతరాయంగా కాల్స్ వస్తున్నట్లు చెప్పారు. ఆ ఫోన్ నంబర్‌ను తాను 15 ఏళ్లుగా ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. అంతేకాదు ఓటరు తొలగింపుకు సంబంధించి తాను ఎలాంటి దరఖాస్తు చేయలేదని వివరించారు. ప్రెస్ బ్రీఫింగ్‌లో రాహుల్ తన నంబర్‌ను ప్రస్తావించడం చూసి షాక్ అయినట్లు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు అంజనీ మిశ్రా మీడియాకు తెలిపారు. ప్రస్తుతం ఈ వ్యవహారం దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

## ఇండియా, మోదీ నాకు మంచి సన్నిహితులే

(మొదటి తరువాయి)

భారతీయ ఉత్పత్తులపై దిగుమతి సుంకాలను అమెరికా 50 శాతానికి పెంచడంతో రెండు దేశాల మధ్య ప్రచ్ఛన్న వాణిజ్య యుద్ధం సాగుతోంది. అయితే ద్వైపాక్షిక చర్చల ద్వారా వాణిజ్య సమస్యలను పరిష్కరించుకోనున్నట్లు చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ వీ అనంత నాగేశ్వరన్ తెలిపారు.

# సెప్టెంబర్ 30లోపు స్థానిక ఎన్నికలు అసాధ్యం

(మొదటి తరువాయి)

ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్, బీజేపీ, ఇతర పార్టీలకు సంబంధించిన పలు అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత కలహాలు ఉన్నాయని, కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును కేంద్రం అడ్డుకుంటోందని ఆరోపించారు. కేసీఆర్, కేటీ–ఆర్, హరీష్ రావు, సంతోష్ రావు కలిసి ఒక ఆడపిల్ల (కవిత)పై దాడి చేయాలని చూస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఇది వారి కుటుంబ సమస్య అని, దీనికి తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. నేను ఎక్కడా కవితకు సపోర్ట్ చేయడం లేదు. ఇది వారి ఇంటి సమస్య. ఆస్తి తగాదాల వల్ల వారి కుటుంబ సమస్యలు బజారున పడ్డాయి. ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని తిరస్కరించారు. ఆ నలుగురిని తెలంగాణ ప్రజలు బహిష్కరించారని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తు చేయిస్తామని గతంలో కిషన్ రెడ్డి చెప్పారని, కానీ ఇప్పుడు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని సీఎం రేవంత్ ప్రశ్నించారు. సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో దర్యాప్తు జరుపుతామని కిషన్ రెడ్డి గతంలో చెప్పారు. కానీ ఇప్పటివరకు ఎందుకు మాట్లాడటం లేదు? కేటీఆర్ ఏం చెబితే కిషన్ రెడ్డి అది చేస్తారు. సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేస్తే అన్ని వివరాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఈ కేసు నుంచి సీబీఐ మొదటి నుంచి దర్యాప్తు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వ నివేదిక ఆధారంగా దర్యాప్తు చేస్తే అన్ని వివరాలు బయటకు వస్తాయి. కాళేశ్వరం సీబీఐ విచారణ జరపకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో రైలుపై మాట్లాడుతూ, ఎల్ అండ్ టి తీసుకునే నిర్ణయాలపై ప్రభుత్వం ఆలోచిస్తుందని చెప్పారు. 'ఎల్ అండ్ టి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పని చేయాలి. కేంద్ర ప్రభుత్వం ఎల్ అండ్ టితో ఒప్పందం కుదుర్చుకోవాలని చెబుతోంది. ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం బయటకు పోతుందని ఎక్కడ చెప్పలేదని రేవంత్ రెడ్డి అన్నారు. డ్రగ్స్ నియంత్రణకు తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని తెలిపారు.



మా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి డ్రగ్స్‌ను కంట్రోల్ చేస్తున్నాం. మా ఈగల్ టీం గోవా వెళ్లి డ్రగ్స్‌తో సంబంధం ఉన్నవారిని పట్టుకుంది. హైదరాబాద్‌లో దొరికిన డ్రగ్స్ తయారీ కంపెనీ గత ప్రభుత్వంలోనే ఏర్పడింది. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్‌తో దొరికారని ఆరోపించారు. 2014–19 మధ్య టీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క మహిళా మంత్రి కూడా లేరని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని, చట్టసభల్లో, లోకల్ బాడీ ఎన్నికల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రభుత్వం ముందుకు వెళ్తుందని తెలిపారు. కండువాలు కప్పినంత మాత్రాన పార్టీ మారినట్లు– కాదు. హరీష్ రావే మాకు 37 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని అసెంబ్లీలో చెప్పారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారని రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రాష్ట్రానికి 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం. ప్రస్తుతం 2 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఉంది. బీజేపీ, టీఆర్ఎస్ ఈ విషయంలో రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు. నక్సలైట్లు– లొంగిపోవడానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు పాలసీలు తీసుకొచ్చాయని చెప్పారు. –టెర్రరిస్టులతో చర్చలు జరపడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నప్పుడు, నక్సలైట్లతో చర్చలు చెప్పడానికి ఇబ్బంది ఏంటని ప్రశ్నించారు. లోకేష్ నాకు తమ్ముడు లాంటివాడు అని కేటీఆర్ చెప్పారు. మరి తమ్ముడు లోకేష్ తండ్రిని జైల్లో పెట్టినప్పుడు కేటీఆర్ ఎక్కడ ఉన్నాడని రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. హైదరాబాద్ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి తెలంగాణ ప్రాధాన్యత రంగాలను వివరించారు. రాష్ట్ర సుస్థిరాభివృద్ధికి ప్రైవేటు– రంగం మద్దతు గురించి తెలిపారు. అభివృద్ధి కోసం 'తెలంగాణ రైజింగ్ 2047' రూపొందించుకున్నట్లు– చెప్పారు. హైదరాబాద్‌లో కోటి మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. నగరంలో ఆర్‌ఆర్‌ఆర్ కూడా నిర్మిస్తున్నాం. ప్రస్తుతం 70 కిలోమీటర్లు ఉన్న మెట్రోను 150 కిలోమీటర్లకు విస్తరిస్తున్నాం. మెట్రోలో ప్రస్తుతం రోజుకు 5 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. వచ్చే ఐదేళ్లలో ఆ సంఖ్యను 15 లక్షలకు పెంచాలనేదే మా లక్ష్యం. గుజరాత్‌లోని సబర్మతీ తీరంలా మూసీ తీరాన్ని అభివృద్ధి చేస్తాం. దీనికోసం మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేశాం. కాలుష్య కారక పరిశ్రమలను హైదరాబాద్ వెలుపలకు తరలిస్తున్నాం. ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహిస్తున్నాం అన్నారు.

ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ఫ్యూచర్‌సిటీని నిర్మిస్తున్నాం. విమానాశ్రయం నుంచి ఫ్యూచర్ సిటీకి కనెక్టివిటీ– ఏర్పాటు– చేస్తాం. హైదరాబాద్–బెంగళూరు మధ్య బుల్లెట్ రైలు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహిస్తాం. డ్రగ్స్ కట్టడిలో మా రాష్ట్ర పోలీసులు దేశంలోనే నెంబర్ వన్‌గా ఉన్నారు. 2034 కల్లా ట్రిలియన్ డాలర్ల, 2047 కల్లా మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మారాలనేది మా లక్ష్యం. దేశ జీడీపీలో 10 శాతం తెలంగాణ నుంచే రావాలనేది మా ధ్యేయం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో న్యూజెర్సీ గవర్నర్ పిలిప్ డి.మర్ఫీ ఢిల్లీలో శుక్రవారం భేటీ– అయ్యారు.

## నగరంలో కురుస్తున్న వర్షాలతో అప్రమత్తం

(మొదటి తరువాయి)

ఆదేశలు జారీ చేశారు. లోతట్టు– ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు ఇబ్బందుల గురించి పిర్యాదులు చేస్తే వెంటనే స్పందించాలని ఆదేశించడం జరిగింది . ప్రజలు పిర్యాదు చేసే టోల్ ఫ్రీ నెంబర్‌లను.. టీ–వీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు తెలిసేలా చేయాలని కోరారు. పునరావాస కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సూచించడం జరిగింది. రైల్వే అండర్ బ్రిడ్జిల వద్ద వాహనదారులు జాగ్రత్తగా వెళ్లేలా అక్కడ పోలీస్ సిబ్బందిని ఏర్పాటు– చేయాలని తెలపారు. భారీ వర్షం కురిసినప్పుడు వరద నీరు పోవడానికి మ్యాన్ హోల్‌లు ఉండేలా చూసుకోవాలని.. ప్రమాదాలు జరగకుండా అక్కడ జిహెచ్ఎంసి సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి సూచించారు. విద్యుత్ స్తంభాల, విద్యుత్ తీగల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తూ మొబైల్ మెసేజ్‌ల రూపంలో సందేశాలు పంపాలని ఆదేశించారు. తీవ్రత అధికంగా ఉన్నప్పుడు అత్యవసరం అయితేనే బయటకు రావాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని అధికారులకు సూచించి, తాగునీటి సరఫరా అయ్యే సమయంలో కచ్చితంగా మంచి నీటి నాణ్యతను పరీక్షించాలలని పేర్కొన్నారు. ఎక్కడ తాగునీరు కలుషితం కాకుండా తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. బస్తీలు.. లోతట్టు– ప్రాంతం మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నగర ప్రజలు ఇలాంటి పరిస్థితులలో మ్యాన్ హోల్ మూతలు తెరవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. హైడ్రా, జిహెచ్ఎంసి, పోలీసు, ఇతర విభాగాల అధికారులు సమన్వయం చేసుకుంటూ పని చేయాలి అని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

## ఎమ్మెల్యేలను దొంగిలించడం నేరం కాదా?

(మొదటి తరువాయి)

మండిపడ్డారు. రాహుల్ గాంధీకి సిగ్గు,శరం ఉంటే బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో వెంటనే రాజీనామా చేయించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అప్పుడే ఆయనకు ఓట్ల చోరీ గురించి మాట్లాడే నైతిక అర్హత ఉంటుందని స్పష్టం చేశారు. ఢిల్లీలో ప్రజాస్వామ్యం గురించి పాఠాలు చెప్పి, గల్లీలో అదే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడం కాంగ్రెస్ పార్టీకి, రాహుల్ గాంధీకి వెన్నతో పెట్టిన విద్య అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని దేశమంతా తిరుగుతూ ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల దొంగతనం గురించి ఉపన్యాసాలు ఇస్తున్న రాహుల్ గాంధీకి, తెలంగాణలో ఆయన పార్టీ చేస్తున్న ఎమ్మెల్యేల దొంగతనం కనిపించకపోవడం కాంగ్రెస్ పార్టీ డిఎన్‌ఏలో ఉన్న ద్వంద్వ ప్రమాణాలకు , రాహుల్ గాంధీ రెండు నాల్కల ధోరణికి నిదర్శనం అని విమర్శించారు.బీఆర్ఎస్ సిద్ధాంతాలు కేసీఆర్ నాయకత్వాన్ని విశ్వసించి తెలంగాణ ప్రజలు గెలిపించిన పది మంది ఎమ్మెల్యేలను అధికార మదం, డబ్బును ఎరగా చూపించి కాంగ్రెస్ లో చేర్చుకోవడం అనైతికం, సిగ్గుమాలిన చర్య కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రజా తీర్పును కాలరాసి కాంగ్రెస్ చేసిన సిగ్గుమాలిన చర్య ఓట్లను దొంగిలించడం కంటే ఘోరమైన నేరం అన్నారు. ఓట్ చోరీ గురించి మాట్లాడే ముందు, తెలంగాణలో కాంగ్రెస్ చేసిన ఎమ్మెల్యేల చోరీపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రజాతీర్పును అపహాస్యం చేసి సంతలో పశువుల్లా తెలంగాణ లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసిన తీరుపై భారత్ జోడో న్యాయ్ యాత్ర చేసిన రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలన్నారు కేటీఆర్. ఫిరాయింపులతో తెలంగాణ ప్రజలకు ఆయన ఏం సందేశం ఇస్తున్నారో చెప్పాలన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే, పార్టీ మారిన ఎమ్మెల్యేలందరితో రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్లాలని సవాల్ విసిరారు. ఎవరి బలం ఏంటో ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామన్నారు. పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించకుండా రాహుల్ గాంధీ ప్రజాస్వామ్యం గురించి మాట్లాడితే దెయ్యాలు వేదాలు వల్లించినట్టు అనిపిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపు రాజకీయాలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టడానికి సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు.

## కాంగ్రెస్‌లో చేరలేదు, కలిసి పనిచేస్తున్నా..

(మొదటి తరువాయి)

ఉన్న పార్టీతో కలిసి పనిచేయడం ద్వారా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని కాంగ్రెస్‌తో నడవడం జరుగుతుందని కడియం క్లారిటీ ఇచ్చారు. గత పదిహేను సంవత్సరాలుగా స్టేషన్ ఘన్ పూర్ నియోజకవర్గానికి జరిగిన అన్యాయాన్ని కొంతైనా పూడ్చవచ్చని కాంగ్రెస్‌తో పని చేస్తున్నానని, ఉపముఖ్యమంత్రిగా ఉన్నని రోజులు నియోజకవర్గంలో అడుగుపెట్టలేదని కడియం శ్రీహరి అన్నారు. కేసీఅర్ డిల్లీలో ఉన్న తనను పిలిచి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారని ఆయన తెలిపారు. రాజకీయ వ్యవస్థను కేసీఆర్ భ్రష్టు పట్టించారని కడియం శ్రీహరి ఆరోపించారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో వివిధ పార్టీల నుంచి 36 మంది ఎమ్మెల్యేలను బీ అర్ఎస్‌లో చేర్చుకున్నారని అందులో శ్రీనివాస్ యాదవ్, సబితా ఇంద్రారెడ్డికి మంత్రిపదవులు ఇచ్చారని కడియం గుర్తు చేశారు. ఆనాడు కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించారని ఎవరితో రాజీనామా చేయించలేదని తెలిపారు. సభ్యత్వం రద్దు కాలేదని కడియం అన్నారు. అధికారం కోల్పోయిన తరువాత ఫాం హౌస్‌కు పరిమితమైన కేసీఅర్‌కు ఇప్పుడు రాజకీయాలు గుర్తుకు వచ్చాయా అని ప్రశ్నించారు. మీరు చేస్తే సంసారం.. మరొకరు చేస్తే వ్యభిచారమా అని ఘాటుగా స్పందించారు. కేసీఆర్ తెలంగాణాను ఆగమం చేశారని కడియం ఆరోపించారు. నేను రాజకీయాల్లో ఎవరికీ పాదాభివందనం చేయలేదని.. నీతి.. నిజాయితీతో రాజకీయాల్లో ప్రజల కోసం పని చేస్తున్నానని అన్నారు.పార్టీ మారారని బీఅర్ఎస్ సుప్రీం కోర్టుకు వెళ్లిందని కోర్టు మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని చెప్పిందే తప్ప, సభ్యత్వాన్ని రద్దు చేయమని చెప్పలేదని కడియం శ్రీహరి అన్నారు. స్పీకర్ తనకు వివరణ ఇవ్వాలని నోటీస్ ఇచ్చారనీ వివరణ ఇచ్చే సమయంలో ఉందని కడియం చెప్పారు. ఏదీ ఏమైనా స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని కడియం శ్రీహరి స్పష్టం చేశారు పార్టీ ఫిరాయింపులకు కడియం శ్రీహరి వ్యతిరేకమని, వ్యక్తిగతంగా ఫిరాయింపులను సమర్థించబోనని కడియం అన్నారు. కానీ నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధి కోసం తప్పని పరిస్థితుల్లో పార్టీ మారాల్సి వస్తుందని కడియం చెప్పారు. నేను పార్టీలో ఉన్నాననే స్పీకర్ చెబుతానని కడియం చెప్పారు.

## సంపాదకీయం


# అప్పుల ఊబినుంచి బయటపడేదెలా ?

రాష్ట్రాలు ఆర్థికంగా దెబ్బతిని అప్పులపాలు అయినా..కేంద్రం చోద్యం చూస్తోంది. ఇబ్బడిముబ్బడిగా అప్పులు చేస్తున్న ప్రాంతీయ పార్టీల నేతలు అభివృద్ధి పేరుతో అప్పులు చేస్తున్నారు. పలు సందర్భాల్లో ఎన్నికల సంఘం,సుప్రీంకోర్టు గట్టిగానే హెచ్చరిస్తోంది. ఉచిత పథకాలతో జీతాలు కూడా చెల్లించడం గగనంగా మారుతోంది. ఈ దుస్థితి పోవాలి. ఇందుకు తెలుగు రాష్ట్రాల్లో అప్పులే నిదర్శనం. ఇలా ఎవరి ఇష్టం వచ్చినట్లుగా వారు అప్పులు చేయడం, అందుకు కేంద్రం అనుమతించడం, ఆ భారం ప్రజలు భరించాల్సి రావడం ఎంతకాలం అన్నది ప్రశ్నించుకోవాలి. రాష్ట్రాలు జీతాలు కూడా సక్రమంగా చెల్లించు కోలేక, ఉద్యోగులు రిటైర్ అయితే బెనిఫిట్స్ చెల్లించలేక నానాయాతన పడుతున్నాయి. అయినా ఉచిత పథకాలు, పెన్షన్లనే అభివృద్ధిగా చూపుతున్నారు. వీటన్నిటికన్నా రాజకీయ నాయకుల జీతభత్యాలే అత్యధికంగా ఉంటున్నాయి. దీనిని కూడా ముందుగా అరికట్టాలి. రాజకీయంగా దుబారాలపై దృష్టి పెట్టాలి. ఇకపోతే కేంద్రం కూడా రాష్ట్రాలను ఆర్థికంగా దెబ్బతీయడం..వారు పథకాలను సక్రమంగా అమలు చేయలేక పోవడం...అప్పులను బూచిగా చూపి దెబ్బతీయడం వంటి ప్రణాళికలతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. మోడీ అధికారంలోకి వచ్చాక కేంద్ర రాష్ట్రాల మధ్య సఖ్యత దెబ్బతినడానికి ఇదే కారణం. రాష్ట్రాల ఆదాయ వనరులను దెబ్బతీయడమే గాకుండా నీతి ఆయోగ్ సిఫార్సుల మేరకు రావాల్సిన మొత్తాలను జిఎస్టీ ద్వారా అందడం లేదు. ప్రధానంగా కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులకు సంబంధించి కూడా అన్యాయమే జరుగుతోంది. మొత్తం పన్నుల్లో 42శాతం నిధులను రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సి ఉండగా గడిచిన సంవత్సరాల్లో 37 శాతం నిధులనే పంపిణీ చేసింది. ఇప్పుడు జిఎస్టీ ఆదాయం తగ్గడం వల్ల రాష్ట్రాల ఇప్పుడు మరింత ఖర్చుల భారం పెరిగే అవకాశం ఉంది. ఏటా 5వేల కోట్ల ఆదాయం కోల్పోతామని ఇప్పటికే డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదాయం తగ్గినా ప్రజలకు మేలు జరగాలని ఎపి సిఎం చంద్రబాబు అన్నారు, ఇకపోతే వివిధ పథకాలతో కాకుండా నేరుగా ఉమ్మడి పథకాలకు కేంద్ర రాష్ట్రాలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పన్నుల వాటా నిధులను సక్రమంగా విడుదల చేయడానికి కేంద్రం చొరవ తీసుకోవాలి. ఉచిత పథకాల పుణ్యమా అని అనేక రాష్ట్రాల్లో అప్పులపైనే భారం వేయాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలే నిదర్శనం. ఇకపోతే ఎముకే లేదన్నట్లుగా అనేక రాష్ట్రాలు కూడా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేస్తూ పోతున్నాయి. అప్పులు చేస్తూ సంక్షేమం పేరిట ఆర్థికస్థితిని దివాళా తీయి స్తున్నాయి. విభజన హామీలతో పాటు, అనేకపథకాల అమలుకు సంబంధించిన నిధులు కూడా కేంద్రం సక్రమంగా ఇవ్వడం లేదు. వైఎస్ జగన్, కెసిఆర్‌లు దుబారాలు చేసి రాష్ట్రాలను దివాళా తీయించారు. దీంతో రాష్ట్రాల ప్రగతి కుంటు పడుతోంది. అదే సమయంలో అప్పులు తెచ్చుకున్నా ఉదార పథకాలకు పందేరం చేస్తున్నారు. దీంతో రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాయి. అప్పులు చేసిన డబ్బులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామని, ఆర్థికస్థితి బలంగా ఉందని ఉభయ తెలుగురాష్ట్రాల సిఎంలు నిస్సిగ్గుగా ప్రకటిస్తున్నారు. నిజానికి అప్పులతో రాష్ట్రాలు కుదేలవు తున్నాయి. మరోవైపు రాష్ట్రాలకి ఎంతో చేస్తున్నామని కేంద్ర ప్రభుత్వ ప్రచారం చేసుకుంటున్నది. ఏమి చేశారో వివరాలు చెప్పడం లేదు. ఎపిలో కీలకమైన రెవెన్యూ లోటు అంశం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉండిపోయింది. రాష్ట్ర విభజన జరిగిన తరువాత 2014-15లో ఎపి రాష్ట్ర లోటు రూ.16వేల కోట్లుగా ఉన్నట్లు కాగ్ తేల్చింది. ఈ వివరాలను రాష్ట్ర అధికారులు కేంద్రం దృష్టికి తీసుకు వెళ్లారు. అయితే, వీటిని మోడీ సర్కారు పట్టించు కోలేదు. అలాగే తొలి ఐదేళ్ల కాలానికి సంబంధించి కూడా లోటు వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర అధికారులు కేంద్రానికి సమర్పించారు. పోలవరం అంచనాలపై పదేపదే చెబుతూ నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యుత్, వ్యవసాయ రంగాల్లో సంస్కరణలు అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తోంది. అమరావతి రాజధాని నిర్మాణ బాధ్యతతమదేనని చెప్పుకున్న కేంద్రం కేవలం రూ.1500 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొంది. రాష్ట్ర పథకాలకు కేంద్రం అందించే నిధుల్లో కూడా కోతలు పెరుగుతున్నట్లు ఆర్థికశాఖ చెబుతోంది. మోడల్ స్కూల్స్, పోలీస్ మోడర్నైజేషన్ స్కీమ్, మెగా ఫుడ్ ప్రాసెసిరగ్ యూనిట్లు, ఇతర నీటిపారుదల, రహదారుల నిర్మాణంవంటి పథకాలకు నిధులు తగ్గినట్లు ఆర్థికశాఖ చెబుతోంది. రాష్ట్ర విభజన సమయంలో ఏడు వెనుకబడిన జిల్లాలకు ఆర్థికసాయం చేస్తామని చెప్పిన కేంద్రం మూడేళ్లకే చేతులెత్తేసింది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు వస్తూనే ఉన్నాయి. నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాలి. రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒక రోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశా లను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు, విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా కేంద్రం కూడా పెద్ద తరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు కూడా గమనించాలి. పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. అప్పుడే దేశ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఉమ్మడిగా ప్రణాళికలు రూపొందించే అవకాశం ఏర్పడుతుంది.

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు

### బంగాళాఖాతంలో మరో అల్పపీడనం..





తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు
తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ**

ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడింది. దీంతో ఈనెల 27 నాటికి వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఇవాళ ఏపీలో పలు జిల్లాలో పిడుగులతో కూడిన వర్షం అవకాశం ఉందని తెలిపింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఎనిమిది జిల్లాలకు భారీ వర్ష సూచన చేసింది IMD.కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం.శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**తెలంగాణలో..**

అలాగే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. గత రెండు, మూడు రోజుల నుంచి సాయంత్రం కాగానే హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఈ రోజు, రేపు తెలంగాణ లోని కొన్ని జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. దక్షిణ ఉత్తరప్రదేశ్ నుండి మధ్యప్రదేశ్, విదర్భల మీదుగా దక్షిణ మరత్వాడ ప్రాంతంలోని ఉపరితల ఆవర్తనం వరకు కొనసాగుతోంది. ఉత్తర అండమాన్ సముద్రం ప్రాంతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం నుండి దక్షిణ బంగాళాఖాతం, దక్షిణ కోస్తా ఆంధ్ర తీరం, రాయలసీమ, ఉత్తర అంతర్గత కర్ణాటకల మీదుగా దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు సగటు సముద్ర మట్టం నుండి 3.1 కి. మీ ఎత్తులో ఈ ద్రోణి ఏర్పడింది.

# పాక్‌లో పేలుళ్లు

## 11 మంది మృతి



**ఇస్లామాబాద్ ప్రజా స్వేచ్ఛ**

పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో జరిగిన వేర్వేరు పేలుళ్లలో 11 మంది మరణించారు. ఇరాన్‌కు సరిహద్దుల్లోని దస్త్ పట్టణానికి సమీపంలో భద్రత దళాల కాన్వారుపై జరిగిన ఆత్మాహుతి బాంబు పేలుడులో ముగ్గరు సైనికులతో సహా ఐదుగురు మృతి చెందారు. పేలుడు పదార్థాలతో నిండిన కారుతో కాన్వారును ఢ కొన్నారు. ఈ దాడికి వేర్పాటువాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ బాధ్యత వహించింది. ఇదే ప్రావిన్స్‌లోని ఆఫ్ఘనిస్తాన్ బోర్డర్ క్రాసింగ్‌కు సమీపంలో జరిగిన మరొక పేలుడులో ఆరుగురు కార్మికులు మృతి చెందారు. గురువారం ఈ పేలుడు ఘటనలు జరిగినట్లు అధికారులు శుక్రవారం ప్రకటించారు. బలూచిస్తాన్‌లో గతకొన్నేళ్లుగా వేర్పాటువాదులు పాకిస్తాన్ సైన్యానికి వ్యతిరేకంగా దాడులకు పాల్పడుతున్నారు. ఈ నెల ప్రారంభంలో బలూచిస్తాన్ రాజధాని క్వెట్టాలో ఒక రాజకీయ ర్యాలీపై ఇస్లామిక్ స్టేట్ గ్రూప్ జరిపిన ఆత్మాహుతి బాంబు దాడిలో 15 మంది మరణించారు.


# జెన్ జెడ్ ఆందోళనలకు దారితీసిన వైఫల్యాలను సరిదిద్దుతాం



**ఖాట్మాండు -ప్రజా స్వేచ్ఛ**

జెన్ జెడ్ ఆందోళనలకు దారితీసిన వైఫల్యాలను సరిదిద్దుతానని నేపాల్ తాత్కాలిక ప్రధాని సుశీలా కర్కి శుక్రవారం స్పష్టం చేశారు. అవినీతిపై పోరాడతానని, ఉద్యోగాలు సృష్టిస్తామని, జీవన ప్రమాణాలను పెంచుతామని ప్రతిజ్ఞ చేశారు. 10 ఏళ్ల క్రితం ఇదే రోజు అమలులోకి వచ్చిన ప్రస్తుత రాజ్యాంగానికి గుర్తుగా శుక్రవారం నిర్వహిస్తున్న నేపాల్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తాత్కాలిక ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సుశీల్ కర్కి మొదటి బహిరంగ సభ ఇది కావడం గమనార్హం.ఉపాధి అవకాశాలను సృష్టించడం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, ప్రభుత్వ పాలనలో పారదర్శకత, అవినీతి నియంత్రణ మరియు అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ నిరసనలు యువత ఆకాంక్షలను ప్రతిబింబిస్తాయని, పెరుగుతున్న అవినీతిపై ప్రజల అవగాహన, అసంతృప్తి స్థాయిలను ప్రతిబింబిస్తాయని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన సుపరిపాలన మరియు శ్రేయస్సును అందించే స్ఫూర్తి మరియు లక్ష్యాలను నెరవేర్చడంలో విఫలమైనందున ఆందోళను జరిగాయన్న వాస్తవాన్ని మనం అంగీకరించాలని అన్నారు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి అయిన సుశీలా కర్కి నేపాల్ ప్రధాని పదవిని చేపట్టిన ఏకైక మహిళ , నేపాల్ ప్రభుత్వానికి నేతృత్వం వహించిన మొదటి మహిళ కూడా. ఈ నెల ప్రారంభంలో జెన్ జెడ్ ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో కె.పి.శర్మఓలి ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల్లో 72 మంది మరణించగా, 2,100 మందికి పైగా గాయపడ్డారు.

# ధర్మస్థలిలో ఏడు పుర్రెలను వెలికి తీసిన సిట్



**గళూరు -ప్రజా స్వేచ్ఛ**

కర్నాటకలోని ధర్మస్థలి లో ఏడు మంది పురుషులకు చెందిన పుర్రెలు లభ్యమయ్యాయి. దక్షిణ కన్నడ జిల్లాలోని బంగ్లగూడ ప్రాంతంలో సిట్ పోలీసులు చేపట్టిన తొవ్వకాల్లో ఆ కళేబరాలు దొరికాయి. ధర్మస్థలి అడవుల్లో సామూహికంగా మహిళలను పాతిపెట్టినట్లు ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గత కొన్నాళ్ల నుంచి స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బృందం తనిఖీలు చేస్తున్న విషయం తెలిసిందే. బుధవారం రోజున అయిదు, గురువారం రెండు పుర్రెలను సిట్ పోలీసులు వెలికి తీశారు.అయితే ఆ పుర్రెలు ఏడాది క్రితం పాతిపెట్టినట్లు ఉన్నాయని తెలుస్తోంది. ఫోరెన్సిక్ పరీక్షలు చేపడితే మరిన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ దొరికిన పుర్రెలకు చెందిన వ్యక్తులు బహుశా సూసైడ్ చేసుకుని ఉంటారని కొందరు భావిస్తున్నారు. యాంటీ నక్సల్ దళానికి చెందిన సిబ్బంది, పోలీసులు, ఫారెస్టు ఆఫీసర్లు.. ధర్మస్థలి ప్రాంతంలో సామూహిక ఖనన ప్రదేశాల్లో గాలింపు చేస్తున్నారు. మహిళలను పాతిపెట్టినట్లు ఫిర్యాదు ఇచ్చిన సీఎన్ చిన్నయ్య ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉన్నాడు. గురువారం స్టేట్మెంట్ రికార్డు చేసేందుకు బెల్తంగడి కోర్టులో అతన్ని హాజరుపరిచారు.మళ్లీ సెప్టెంబర్ 23వ తేదీన చిన్నయ్యను కోర్టు ముందు హాజరుపరచనున్నారు. ధర్మస్థలి సామూహిక ఖనన ప్రదేశాల గురించి ఏదైనా సమాచారం ఉంటే దాన్ని రికార్డు చేయాలని గురువారం హైకోర్టు జస్టిస్ ఎం నాగప్రసన్న ఆదేశాలు ఇచ్చారు.

# ముంబయి హైకోర్టుకు మళ్లీ బాంబు బెదిరింపులు



**ముంబయి ప్రజా స్వేచ్ఛ**

ముంబయి హైకోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు వచ్చింది. కోర్టును బాంబులతో పేల్చేస్తామని ఓ గుర్తు తెలియని వ్యక్తి నుంచి శుక్రవారం తెల్లవారుజామున మెయిల్ వచ్చింది. దీంతో అధికారులు అప్రమత్తమై పోలీసులకు సమాచారమిచ్చారు. అదనపు పోలీసుల బలగాలు కోర్టు చుట్టూ మోహరించాయి. అలాగే బాంబు స్క్వాడ్‌ని రప్పించి తనిఖీలు చేపట్టారు. కోర్టులోకి వచ్చి, వెళ్లే వాహనాలను ప్రతిదానిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో బాంబు లేదని తేలడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మెయిల్ పంపిన వ్యక్తిని ట్రేస్ చేసి పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అయితే ఈ బెదిరింపు మెయిల్‌తో.. కోర్టు కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం కలగలేదు. కాగా, ఈ నెలలోనే హైకోర్టు బాంబు బెదిరింపులు రావడం ఇది రెండోసారి. సెప్టెంబర్ 12వ తేదీన బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో కోర్టు కార్యకలాపాలకు కొంత అంతరాయం కలిగింది. భయంతో లాయర్లు, న్యాయమూర్తులు అందరూ కోర్టు బయటకు పరుగులు తీశారు. అప్పుడు కూడా బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించగా.. బాంబులు దొరకలేదు.

# దుబే కాలనీలో ‘మన బస్తి బాట’ 6వ రోజు కార్యక్రమం..

**సమస్యలను నేరుగా పరిశీలించిన మారబోయిన రవి యాదవ్**



**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని 106వ డివిజన్ దుబే కాలనీలో మన బస్తి బాట కార్యక్రమం యొక్క 6వ రోజు విజయవంతంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారబోయిన రవి యాదవ్ ఉదయం 7 గంటలకే దుబే కాలనీ చేరుకుని, ప్రజల చెప్పిన సమస్యలను నేరుగా విన్నారు.ప్రజలు తెలిపిన ప్రధాన సమస్యలు తాగునీటి సరఫరా లోపం, వీధులు మరియు గల్లీలలో డ్రైనేజీ సమస్యలు, విద్యుత్ స్తంభాలపై దీపాల లోపం, అశుభ్రత మరియు రోడ్లపై చెత్త వ్యర్థాలు, దోమల వల్ల వచ్చే వ్యాధులు, మౌలిక సదుపాయాల అభావం లింగంపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రారంభమయ్యే రోడ్డుపై ఓపెన్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది, ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను నెట్‌తో కప్పాలి, మున్సిపల్ అధీనంలోని పార్కుల శుభ్రపరిచే కార్యక్రమం పూర్తి కాకపోవడం, అభివృద్ధి పనులు నిలిపివేయబడడం. రవియాదవ్ ప్రతిస్పందించి రవి యాదవ్ మాట్లాడుతూ కార్పొరేటర్, ఎమ్మెల్యే ప్రజల అవసరాల పట్ల నిర్లక్ష్యం చూపించడం చాలా విచారకరమని, నేను ఈ సమస్యలన్నింటినీ త్వరితగతిన పరిష్కరించడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఏ సమస్యను ఎదుర్కొన్నా నేను వెనుకాడననీ, ప్రజలకు అవసరమైన సదుపాయాలు అందించడం నా ప్రాథమిక విధి అని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నేను నిరంతరం పని చేస్తూనే ఉంటానన్నారు. దుబే కాలనీ ప్రజల అవసరాలను త్వరితగతిన పరిష్కరిస్తాననీ తెలిపారు. ఈ కార్యక్రమం లో మల్లేష్ ముదిరాజ్, స్వామినాథ, ప్రభాకర్ గౌడ్, వెంకటరెడ్డి, సోమనాథ్, శ్రీకాంత్ యాదవ్, గడ్డం శ్రీనివాస్, సురేష్ యాదవ్, గంగాధర్ గౌడ్, కొండకల్ శ్రీనివాస్, నవీన్ గౌడ్, సత్తి గౌడ్, సాయి నందన్ ముదిరాజ్, పవన్, రాంబాబు, స్వామి ముదిరాజ్, వెంకటేష్ యాదవ్, రాజు గౌడ్, జంగాయ, బాలరాజు, శంకర్, మున్నా, కృష్ణ, మల్లేష్, శివాజీ, వెంకటేష్, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలి

## శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి**
విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ తెలిపారు. శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవంను పురస్కరించుకుని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ వెంకటయ్య పాల్గొన్నారు.కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు ఐడి కార్డులను పంపిణీ చేసిన అనంతరం మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారోత్సవంలో ఎంపికైన ఉపాధ్యాయులను సన్మానించి షీల్డ్ లను బహుకరించిన కార్పొరేటర్. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నిస్వార్థ సేవలను ప్రశంసిస్తూ, సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకపాత్ర అని తెలియజేసారు.



తెలంగాణ నినాదాన్ని ఉద్యమాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్ళింది టీచర్లని గుర్తు చేశారు. తెలంగాణ సమాన జీవన ప్రయాణానికి దిశానిర్దేశం చేసి గురువులు సమాజ నిర్మాణానికి శిల్పులని అన్నారు. మీ ప్రేరణాత్మక సేవ దృక్పథం ప్రజల పట్ల చూపుతున్న కృతనిశ్చయం, గురువుల త్యాగమయమైన ఆత్మను ప్రతిబింబిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుపూజోత్సవం రోజున ప్రతి గురువుకి కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. పూర్వ విద్యార్థి అయినా కార్పొరేటర్ ఉపాధ్యాయుల పట్ల తన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రతి విద్యార్థి ఉన్నతమైన చదివిన చదువుకుని ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఈ పాఠశాల పూర్వ విద్యార్థులు మాజీ కౌన్సిలర్లు సోమదాస్,వీరేశంగౌడ్, కే.రాంచందర్, శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాష్ చంద్ర రెడ్డి, పీ.ఆర్.టీ.యూ టీ.ఎస్ రంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షులు శ్యామల మహేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షులు రాఘవేందర్, ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు బలవంత్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు తాజ్ బాబు బసవలింగం, వసుంధర, శైలజ, పి.ఆర్.టి.యు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హనుమంతు, రవీందర్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు బాల్రెడ్డి, కర్ణ, పీ.ఈ.టీ టీచర్ కేశవరెడ్డి, వీరేశం, ఎంపీపీఎస్ గోపినగర్ హెచ్ఎం శివరాజ్, ఎంపీపీఎస్ సురభి కాలనీ హెచ్ఎం పాండురంగారెడ్డి, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, వార్డ్ మెంబర్ కవిత, రాజ్ కుమార్, సుధాకర్ రెడ్డి, మహేష్ చారీ, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పోచారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేసిన సిపిఎం నాయకులు



**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్**
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపల్ కమిషనర్ కు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు మెమోరాండం ఇవ్వటం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చింతల యాదయ్య మండల కార్యదర్శి నార్కట్పల్లి సబిత మండల కమిటీ సభ్యురాలు కామ్రేడ్ గుర్రం నాగమణి మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప లో చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ గాంధీజీ బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాల చుట్టూ ఉన్న ప్రహరీ గోడను కూల్చివేయాలని ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సెంటర్లో ఆర్టీసీ బస్సు ఆటో ట్రాలీలు ఇతర వాహనాలు తిరగడం వలన ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు కాబట్టి దీన్ని పోచారం మున్సిపల్ కమిషనర్ సందర్శించి అక్కడి ప్రజల అభిప్రాయాలను తెలుసుకొని చుట్టూ ఉన్నటువంటి ప్రహరీ గోడను కూల్చివేయటం వలన ఆటో పార్కింగ్ ఇతర వాహనాల పార్కింగ్ వచ్చిపోయే వాహనాలకు ఉంటుందని వారు కమిషనర్ కు వివరణ ఇవ్వటం జరిగింది కమిషనర్ మాట్లాడుతూ నేను ఆ ప్రాంతాన్ని సందర్శించిన అనంతరము ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొని ప్రజలంతా అనుకూలిస్తే నేను ఆ యొక్క ప్రహరీ గోడను తొలగిస్తాను అని హామీ ఇవ్వడం జరిగింది అదేవిధంగా మున్సిపల్ పరిసర ప్రాంతాల్లో వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారు కాబట్టి వీధిలైట్లను సమకూర్చాలి అని కమిషనర్ గారిని కోరడం జరిగింది వారు దీన్ని కూడా సానుకూలంగా స్పందించారని చింతల యాదయ్య మరియు నార్కట్పల్లి సబిత గుర్రం నాగమణి తెలియజేశారు

## ఆచార్య ఎస్వీ రామారావు సేవలు చిరస్మరణీయం

**-మృతిడి కుటుంబ సభ్యులను పరామర్శ.**
**-సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాజీ మంత్రివర్యులు**



**ప్రజా స్వేచ్ఛ**
**వనపర్తి జిల్లా ప్రతినిధి.**
ఆచార్య ఎస్.వి.రామారావు చేసిన తెలుగు సాహిత్య సేవలు చిరస్మరణీయం అంటూ హైద్రాబాద్ ఎల్బీనగర్ చిత్ర లేఅవుట్ లోని బాలాజీ రెసిడెన్సీ కి వెళ్లి, ఆయన భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండలానికి చెందిన ఎస్.వి.రామారావు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా, తెలుగు శాఖాధిపతిగా,డీన్ గా ఎన్నో సేవలందించారని మాజీ మంత్రి గుర్తు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు మాట్లాడుతూ, ఆచార్యునిగా, పరిశోధకుడిగా, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలందించిన ఆచార్య ఎస్వీ రామా రావు గారి మృతి ఎంతో బాధకరం అని ఆయన కొనియాడారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దారు. వీరి పరిశోధన గ్రంథం సాహిత్య లోకంలో పేరెన్నిక గన్నది. తెలుగు సాహిత్య చరిత్రను రాసి మన ప్రాంతానికి ఎంతో పేరు ప్రతిష్టలు తెచ్చారు. ఎన్నో విలువైన గ్రంథాలను రచించి తెలంగాణ ప్రాంతానికి ఎంతో గౌరవాన్ని సంపాదించి పెట్టారని అన్నారు.మాజీ మంత్రి వెంట బ్రాహ్మణ పరిషత్ రాష్ట్ర సభ్యులు గోపాల శర్మ, బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

## స్కూల్ కి ఆకర్షణీయంగా మెరుగులు దిద్దిన వయాప్లస్ విన్స్ హైవేస్ రాకీ..

**ధన్యవాదాలు తెలిపిన హెడ్ మాస్టర్ మోహన్ రావు, ఉపాధ్యాయ బృందం**




**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి**
మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల మాదాపూర్ నందు వయా ప్లస్ విన్స్ హైవేస్ రాకీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణం పరిశుభ్రత, మొక్కలు నాటుట, గ్రీనరీ షెడ్ ఏర్పాటు , వాల్ పెయింటింగ్, కూర్చొనే బెంచీలు తో ఆకర్షణీయంగా పాఠశాల ఆవరణం ను చేయించడం జరిగింది. సహకారభావంతో దాతృత్వ గుణాన్ని కలిగి ప్రభుత్వ పాఠశాల లో చదివే పిల్లల వాతావరణం పరిశుభ్రం గా పచ్చని చెట్లు తో వికసించాలని తలంపు తో చేపట్టిన బృహత్తర కార్యక్రమం కు కృతజ్ఞతలు తో కూడిన అభినందనలు ప్రధానోపాధ్యాయులు మోహన రావు తెలియ జేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సుధారాణి, లీలా దేవి, బాలా మణి, రాజగోపాల్ రెడ్డి, ప్రసాద్, ప్రేమ్ కుమార్, సారిక,నవ్య పాల్గొనడం జరిగింది.

## మియాపూర్ లో బిజెపి ఆధ్వర్యంలో మహా రక్తదానశిబిరం

**పాల్గొన్న రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు**



**ప్రజా స్వేచ్ఛ శేరిలింగంపల్లి ప్రతినిధి**
రక్తదానం మహాదానం రక్తదానం చేయండి ప్రాణదాతలు కండి అని సేవా పక్షంలో భాగంగా దేశ ప్రజల కోసం దేశం కోసం ధర్మం కోసం దేశ అభివృద్ధి కోసం నిత్యం తపించే మహోన్నత వ్యక్తి, కారణజన్ముడు, భరతమాత ముద్దు బిడ్డ, మరో హనుమంతుడు ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర పార్టీ సూచన మేరకు గురువారం రోజున శేరిలింగంపల్లి నియోజకవర్గ కంటే స్టెడ్ ఎమ్మెల్యే ఎం రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మియాపూర్ 108 డివిజన్ ఆర్ బి ఆర్ కాంప్లెక్స్ వద్ద మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది దానిలో భాగంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షులు ఎన్. రామచంద్రరావు విచ్చేసినారు . మియాపూర్ డివిజన్ ఎస్సీ మోర్చా అధ్యక్షులు పత్తి బసవ శివ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు ని శాలువాతో సత్కరించడం జరిగింది. మియాపూర్ డివిజన్ ఎస్సీ మోర్చా నుండి రక్తదానం చేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు కొండపల్లి సమ్మయ్య,పత్తి వెంకటేష్ పత్తి సైదులు, కొండపల్లి సాయి,భావూరి సురేష్ కుమార్ ,బావురి చోటారా, కల్లెం భాస్కర్, కడమంచి రాములు, బి పప్పియ రామ్ , గరుడ సురేష్ కుమార్, గరుడ హనుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## డొల్ల హామీలు,ఖాళీ ఖజానాతో రాష్ట్ర ప్రభుత్వం జోలె పట్టి బిక్షాటన చేసే అద్వాన పరిస్థితి : వైయస్ఆర్



**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**
ఘట్కేసర్ రైతు సహకార సంఘం పరిధిలో రైతులకు రుణమాఫీ జరపకుండా తాత్సారం చేస్తున్న ప్రభుత్వం మొండి వైఖరికి నిరసనగా రైతు రుణమాఫీ సాధన సమితి ఆధ్వర్యంలో చేస్తున్న వివిధ నిరసనల్లో బాగంగా శుక్రవారం ఘట్కేసర్ మున్సిపాలిటీ వ్యాప్తంగా జోలె పట్టి బిక్షాటన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి తదితరులు

## రేపు జోగులాంబ ఆలయం మూసివేత

**జోగులాంబ, ప్రజా స్వేచ్ఛ**
అలంపూర్‌లో ప్రసిద్ధి చెందిన జోగులాంబ దేవి ఆలయం రేపు మధ్యాహ్నం 1:00 గంటల నుండి సాయంత్రం 6:30 గంటల వరకు భక్తులకు మూసివేయబడనుంది. ఈ విషయాన్ని ఆలయ ఈవో దీప్తి శుక్రవారం ప్రకటనలో తెలిపారు.దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ శుద్ధి, పవిత్రోత్సవం నిర్వహణ కోసం తాత్కాలికంగా మూసివేస్తున్నట్టు వివరించారు. అయితే బాల బ్రహ్మేశ్వర స్వామి దర్శనం యథావిధిగా కొనసాగుతుంది.
భక్తులు మార్పును గమనించి ఆలయ నిర్వాహకులకు సహకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.

# నూతన వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపిన

నల్లమద్ది రాజ శేఖర్ రెడ్డి మాజీ జడ్పీటీసీ



**ప్రజా స్వేచ్ఛ అడ్డాకుల.**
అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన ఎం.డి ఇస్మాయిల్ కుమారుడు ఎం.డి షాకీర్ (మజీద్ ఇమామ్) వివాహం,ఇటీవల జరిగిన సందర్భంగా నేడు వారి స్వగృహానికి వెళ్లి నూతన వరుడు, మరియు కుటుంబ సభ్యులకు (నిఖా) వివాహ శుభాకాంక్షలు తెలిపిన అడ్డాకుల మండల మాజీ జెడ్పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి.మరియు, మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో మండల సింగిల్ విండో చైర్మన్ మద్దూరి జితేందర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్ రెడ్డి,మండల మాజీ కోఆప్షన్ ఖాజా గోరి, నాయకులు కావలి నాగరాజు,ఎలుసరి శ్రీనివాసులు,బొడ్డు రమేష్,ఎలుసరి బాలరాజు,జహంగీర్ గోరి,మహేష్ యాదవ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.


# చికిత్స పొందుతున్న బాలుడికి ఆర్థిక సాయం చేసిన

నల్లమద్ధి రాజశేఖర్ రెడ్డి.మాజీ జడ్పీటీసీ అడ్డాకుల



**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి.**
అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన యువకుడు నాగార్జున కుమారునికి ఇటీవల అనారోగ్యంతో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని సాన్వి మల్టీ స్పెషాలిటీ ప్రైవేట్ హాస్పిటల్ లో బాలుడు చికిత్స పొందుతున్నాడు.ఇట్టి విషయం తెలుసుకున్న అడ్డాకుల మండల మాజీ జెడ్పిటిసి నల్లమద్ది రాజశేఖర్ రెడ్డి, మండల కేంద్ర బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఈరోజు జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాలుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని పరామర్శించారు. మాజీ జెడ్పిటిసి, మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కలిసి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు.చిన్నారి బాలుడు ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని మాజీ జెడ్పిటిసి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మద్దూరి చంద్రమోహన్ రెడ్డి, మండల మాజీ కోఆప్షన్ ఖాజా గోరి, బొడ్డు రమేష్, డేవిడ్, ప్రశాంత్, నాగవర్ధన్ తదితరులు ఉన్నారు

# గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ లో ప్రపంచ పర్యావరణ హిత భవనాల వారోత్సవం





**ప్రజా స్వేచ్ఛ పటాన్ చేరు ప్రతినిధి**
హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్, సుస్థిరత, ఆవిష్కరణ, పచ్చని భవిష్యత్తును రూపొందించడంలో వాస్తుశిల్పం పాత్రను జ్ఞప్తిచేసుకోవడంలో భాగంగా 'ప్రపంచ గ్రీన్ బిల్డింగ్ వారోత్సవం-2025'ను నిర్వహించారు తొలిరోజు, బీఆర్క్ రెండో ఏడాది విద్యార్థులు హైటెక్ సిటీలోని సీఐఐ-ఐజీబీసీ ప్రాంగణాన్ని సందర్శించి, ఇంధన-సమర్థవంతమైన వ్యవస్థలు, పర్యావరణ అనుకూల ప్రణాళికతో సహా స్థిరమైన డిజైన్ యొక్క అనుభవజ్ఞులైన ప్రత్యక్ష ఉదాహరణలను తెలుసుకున్నారు. రెండో రోజు, గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ (ఐజీబీసీ) ఆలోచింపజేసే వెబినార్ నిర్వహించింది. స్థిరత్వం యొక్క ఆర్థిక కోణాలను, పర్యావరణ హిత ఆలోచనలను ఆచరణీయ ప్రాజెక్టులుగా మార్చడానికి స్మార్ట్ పెట్టుబడుల సామర్థ్యాన్ని ఇందులో ప్రముఖంగా ప్రస్తావించారు ఇక మూడవ రోజు, గీతం ప్రాంగణంలోని వ్యర్థాలను అద్భుతమైన డిజైన్ నమూనాలుగా పునర్నిర్మించడంలో విద్యార్థుల సృజనాత్మకతకు ప్రధాన వేదికగా మారింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వ్యర్థాలను వనరుగా ఎలా మార్చవచ్చో తెలియజేయడంతో పాటు స్థిరత్వానికి వినూత్న, ఆచరణాత్మక విధానాలను జోడించారు స్థిరమైన రేపటి కోసం ప్రపంచ పిలుపునకు అనుగుణంగా, నిర్మిత వాతావరణాన్ని పునరాలోచించడం, పున:రూపకల్పన చేయడం, పునర్నిర్మించడం పట్ల లోతైన అవగాహనను పెంపొందించేలా ఈ వేడుక సాగింది. కాగా, ఈ కార్యక్రమాన్ని హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహ ఎస్. రెడ్డి సమన్వయం చేశారు.

# తల దించుకుని బాగా చదివి తలెత్తుకునే స్థాయికి ఎదగాలి

-తల్లిదండ్రులు గర్వపడే స్థాయికి విద్యార్థులు ఎదగాలి.
-రావుల గిరిధర్ (ఐపీఎస్)ఎస్పీ, వనపర్తి





**ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి/వనపర్తి జిల్లా ప్రతినిధి.**
వనపర్తి జిల్లా, పెద్దమందడి మండల ప్రాథమిక పాఠశాల లో, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్(ఐపీఎస్)ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, అనుకున్న లక్ష్యాలను సాధించాలని అనుకుంటే నిబద్ధత కఠోర సాధన చేసి ప్రణాళిక బద్ధంగా చదవడం ద్వారా మీ కలలను సాధించుకోవచ్చని యువత తమ సమయాన్ని వృధా చేయకుండా కఠోర సాధన పై దృష్టి సారిస్తే అనుకున్న ఉద్యోగాలను సాధించగలరని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపిఎస్ అన్నారు. విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు సహకారంతో పాఠ్య పుస్తకాలలో ఉన్న విజ్ఞాన పిల్లల్ని ఆకర్షించే విధంగా తరగతి గదులకు కార్టూన్లు, సైంటిస్టుల చిత్రాలతో పెయింటింగ్ వేయించారు. మరియు పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు గార్ల చేతుల మీదుగా పెయింటింగ్ వర్క్ ను పాఠశాల తరగతి గదులను జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్ ప్రారంభించి విద్యార్థిని విద్యార్థులకు బూట్లను పంపిణీ చేశారు. ఎస్పీ కి విద్యార్థిని విద్యార్థులు స్వాగతం తెలిపారు. ఎస్పీ విద్యార్థులకు మార్గ నిర్దేశం చేశారు. బాలలకు తరగతి గదిలోనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉందన్నారు. ప్రజలకు చట్టాలు, శిక్షలు సత్ప్రవర్తన పై అవగాహన కల్పిస్తున్నాం అని తెలిపినారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మాతృభూమికి మంచి పేరు తేవాలి, ప్రజలకు సేవలు అందించే విధంగా ఎదగాలి అన్నారు.చాలా సంవత్సరాల క్రితం చదువుకోవడానికి సరియైన వసతులు లేవు. ఇప్పుడు పరిస్తితి మారినది ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక వసతులు కల్పించి ఉన్నతమైన నాణ్యమైన సాంకేతిక విద్య అందిస్తుంది అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎన్నో నైపుణ్యాలతో విద్యను బోధిస్తున్నారు అన్నారు.
ఈ కార్యక్రమంలో పెద్దమందడి విద్యాశాఖ అధికారి,మంజులత, పెద్దమందడి ఎస్సై, ఈ.శివ కుమార్, ఎసిటిఓ ప్రసన్న రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బండి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు జి కె. శ్రీనివాస్, రోజా రాణి, కిరణ్ కుమార్, సుచిత్ర, ఈశ్వర్,మధు, పాఠశాల,పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఐడెంటిటీ కార్డుల పంపిణీ చేసిన జన్నె సిద్దులు

- విద్యార్థులకు చేసే సహాయం వారి బంగారు భవిష్యత్తుకు బాటలు అవుతాయి
- ఎంఈఓ కె.రఘురాం రెడ్డి




**ప్రజా స్వేచ్ఛ మోటకొండూరు మండల ప్రతినిధి**
ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థినీ,విద్యార్థులకు తమ సహకారం ఉంటుందని మాటూరు మాజీ సర్పంచ్ జెన్నే సిద్దులు అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూర్ మండలంలోని మాటూర్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలలో చదివే విద్యార్థులందరికీతన స్వంత నిధులతో ఐడెంటిటీ కార్డులను తయారు చేయించి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో మంచి శిక్షణ పోందిన ఉపాధ్యాయులు ఉంటారని,ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. పిల్లలను ప్రోత్సహిస్తే మంచి చదువులు చదువుతారని అన్నారు. విద్యాధికారి కె.రఘురాం రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించేందుకు పెద్దమనసుతో ముందుకు వచ్చి , ఐడెంటిటీ కార్డులను సమకూర్చిన జన్నె సిద్దులును ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులకు చేసే చిన్న సహాయమైనా వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ రెడ్డి,ఎపిపిసి చైర్మన్, ఉపాధ్యాయ బృందమంతా కలిసి ధాత జన్నె సిద్దులును సత్కరించారు .ఈ కార్యక్రమంలో ఎపిపిసి చైర్మన్ బబితా, ఉపాధ్యాయులు లోకేష్ కుమార్, నరేందర్, వెంకటేశ్వర్ రెడ్డి, గోవర్ధన్, శ్రీదేవి , ప్రాథమిక పాఠశాల హెచ్ యం రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

-జమాతే ఇస్లామీ ఎక్స్ పో-2025ను ప్రారంభించిన సుడా చైర్మన్ నరేందర్ రెడ్డి, ఎంఐఎం టౌన్ ప్రెసిడెంట్ గులాం అహ్మద్





**ప్రజా స్వేచ్ఛ కరీంనగర్,**
మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్ తరాలకు వారసత్వంగా భావించి,కుల, మతాలకతీతంగా, గురుతరమైన బాధ్యతతో తెలియపరచాలని,ఈ బృహత్తర కార్యక్రమాన్ని జమాతే ఇస్లామీ హింద్ చేపట్టడం అభినందనీయమని ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డిలు అన్నారు.శుక్రవారం నగరంలోని సర్కస్ గ్రౌండ్ లో మహ్మద్ ప్రవక్త జన్మదినం మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 19 నుండి 21 వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న ఎక్స్ పో 2025ను ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డినరేందర్ రెడ్డిలు కలిసి సంయుక్తంగా ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన స్టాల్స్ లో వివిధ పాఠశాలల విద్యార్థులు ప్రవక్త యొక్క భోదనలు తెలిపే విధంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలు,మానవీయ కోణంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల అంశాలు తిలకించడం జరిగింది. అనంతరం గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మహ్మద్ ప్రవక్త సూక్తులు యావత్తు మానవాళికి అనుసరణీయమని,ఆయన చెప్పిన మార్గంలో నడిపించే విధంగా ఈ ఎక్స్ పో ఏర్పాటు చేయడం భవిష్య తరాలకు మహమ్మద్ ప్రవక్త చరిత్రను కుల మతాలకతీతంగా తెలియపరచడం సంతోషదాయకమని,ఈ బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టిన జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ ప్రతినిధులను అభినందించారు.ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామీ హింద్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు షోహైబ్ అహ్మద్ ఖాన్ ప్రతినిధులు మహమ్మద్ ఖైరుద్దీన్,ఉమేర్ అహ్మద్ ఖాన్, ఇస్ హాఖ్,నయిమ్,తన్వీర్ అహ్మద్ ఖాన్,సయ్యద్ మెయిన్ అహ్మద్,సయ్యద్ జుబేర్ అహ్మద్,లక్ష్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ముస్తాక్ అలీ,నవాబ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ ఫసియోద్దీన్ నవాబ్,ఎంఐఎం నాయకుడు అబ్బాస్ సమీ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా అవగాహన సదస్సు

హాజరైన లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్



**ప్రజా స్వేచ్ఛ రామన్నపేట ప్రతినిధి**
మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలనుసారం,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి గవ్వ జ్యోతి సమక్షంలో మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో లీగల్ టీమ్ సభ్యులు బత్తుల గణేష్ పాఠశాలలో లీగల్ ఎయిడ్ క్లినిక్ ఏర్పాటు చేసి, విద్యార్థులకి అవగాహన కల్పించారు.విద్యార్థులు దసరా సెలవుల సందర్భంగా ఇంటికి వెళ్ళిన క్రమంలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువు తో పాటు చట్టాలపై అవగాహన ఉండాలని, బయట సమాజంలో బాలికల పట్ల ఎన్నో రకాల అగత్యాలు జరుగుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యత, అవగాహన ముఖ్యం అని అన్నారు.విద్య హక్కు చట్టం, పోక్సో చట్టం,మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలు,బాల కార్మికుల చట్టాలు,బాల్య వివాహాలు,తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజినెస్

## పసిడి మరింత చౌక.. రూ.600 తగ్గిన పది గ్రాముల ధర



న్యూఢిల్లీ,
బంగారం కొండ దిగొస్తున్నది. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొట్టిన అతి విలువైన లోహాల ధరలు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో డిమాండ్ భారీగా పడిపోవడంతోపాటు అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావు శాతం తగ్గించడంతోపాటు ఈ ఏడాది మరో రెండుసార్లు రేట్లను తగ్గించే అవకాశాలున్నట్టు ఇచ్చిన సంకేతాలు మదుపరులకు రుచించలేదు. ఫలితంగా అమ్మకాలకు మొగ్గుచూపడంతో బంగారం ధరలు తగ్గాయి.ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర రూ.600 దిగి రూ.1,13,200కి తగ్గింది. అంతకుముందు ఇది రూ.1,13,800గా నమోదైంది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర రూ.500 తగ్గి రూ.1,12,800కి చేరుకున్నది. బంగారంతోపాటు వెండి రూ.300 తగ్గి రూ.1,31,500 గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 3,668.33 డాలర్లకు చేరుకోగా, వెండి 41.90 డాలర్ల వద్ద ఉన్నది.

## పండుగ డిస్కౌంట్లు బంద్.. వాహన అమ్మకాలపై ఈసారి నో ఆఫరు

**మార్కెట్ విశ్లేషకుల అంచనాలు**
**జీఎస్టీ తగ్గింపే కారణమన్న అభిప్రాయాలు**
**కొనుగోలుదారులకు లాభం అంతంతేనా?**



న్యూఢిల్లీ,
: ఈ పండక్కి కారో, బైకో కొనాలనుకున్నారా? ఏటా ఈ సీజన్‌లో ఆటో సంస్థలిచ్చే ఆఫర్లకుతోడు వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) తగ్గింపు కూడా కలిసొస్తుందని ఈ నెల 22 తర్వాత కొందాంలే అనుకొని ఆగిపోయారా? అయితే మీ ఆశలు అడియాసలే కావచ్చు. అవును.. ప్రతీ సంవత్సరం దసరా, దీపావళి సందర్భంగా ఆటో ఇండస్ట్రీలో కనిపించే ఆఫర్ల సందడి ఈసారి ఉండకపోవచ్చు. జీఎస్టీ కోతల నేపథ్యంలో డిస్కౌంట్లకు దూరంగా ఉండాలని అటు వాహన తయారీ సంస్థలు, ఇటు డీలర్లు యోచిస్తున్నట్టు చెప్తున్నారు మరి. దీంతో ఈ ఏడాది పండుగ పూట రాయితీలకు అవకాశాల్లేవనే అంచనాలే గట్టిగానే వినిపిస్తున్నాయిప్పుడు. ఫలితంగా గతంతో పోల్చితే ఇప్పుడు కొత్తగా ఒనగూరే లాభం ఏమీ ఉండకపోవచ్చన్న అభిప్రాయాలే అందరి నోటా వ్యక్తమవుతున్నాయి. కాగా, ఇటీవలి జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను స్లాబులను 4 నుంచి 2కు తగ్గించిన విషయం తెలిసిందే. 12, 28 శాతం స్లాబులను ఎత్తేశారు. దీంతో వాటిలోని ఆయా ఉత్పత్తులు 5, 18 శాతం స్లాబుల్లోకి వచ్చేస్తున్నాయి. ఈ క్రమంలోనే వాహనాలపై 28 శాతం నుంచి 18 శాతానికి జీఎస్టీ తగ్గుతున్నది. ఈ నెల 22 నుంచి కొత్త రేట్లు అమల్లోకి వస్తాయి. 4 మీటర్లకుపైగా ఉన్న ఎస్‌యూవీలపైనా జీఎస్టీ 40 శాతానికి (సెస్సు లేకుండా) తగ్గుతున్నది. ఇప్పుడు 43-50 శాతం పడుతున్నది. ట్రాక్టర్ విడిభాగాలపై జీఎస్టీ 12-18 శాతం నుంచి 5 శాతానికి దిగొస్తున్నది.

**మోతీలాల్ ఓస్వాల్ మాట..**
కార్లు, ద్విచక్ర వాహన తయారీదారులు ఈ పండుగ సీజన్‌లో గతంలో మాదిరి డిస్కౌంట్లు, ఆఫర్లను తీసుకువచ్చే వీల్లేదని, ఒకవేళ తెచ్చినా నామమాత్రంగానే అవి ఉంటాయని దేశీయ బహుళ ఆర్థిక సేవల దిగ్గజం మోతీలాల్ ఓస్వాల్ సంస్థ అంటున్నది. మార్కెట్‌లో డిమాండ్ పెద్ద ఎత్తున కనిపిస్తున్నదని చెప్తున్నది. ఈ క్రమంలోనే ఆటో ఇండస్ట్రీ సేల్స్‌పై తమ గత అంచనాలను సంస్థ సవరించింది కూడా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) టూవీలర్ అమ్మకాలు 4 శాతం పెరుగుతాయని, వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) 7.5 శాతం వృద్ధి ఉండొచ్చంటున్నది. మునుపు ఈ అంచనాలు వరుసగా 1 శాతం, 5.7 శాతంగానే ఉండటం గమనార్హం. అలాగే ప్యాసింజర్ కార్ సేల్స్ కూడా 3 శాతం, 8 శాతానికి పెరగొచ్చంటున్నది. గతంలో ఈ అంచనాలు 2 శాతం, 4 శాతంగానే ఉన్నాయి. ఇక వాణిజ్య వాహనాలు ఈసారికి 5 శాతం, వచ్చేసారికి 7 శాతం చొప్పున అమ్మకాలను పెంచుకోవచ్చు. ట్రాక్టర్ విక్రయాలు సైతం 10 శాతం, 6 శాతంగా ఉండొచ్చని మోతీలాల్ ఓస్వాల్ అంచనా వేస్తున్నది. మొత్తానికి జీఎస్టీ తగ్గింపు కంపెనీలకే లాభిస్తున్నదిగానీ, కస్టమర్లకు కాదు అన్న వాదనలున్నాయి.

## ఫ్లిప్‌కార్ట్‌లో బుల్లెట్ బైకులు

న్యూఢిల్లీ,
ఈ-కామర్స్ సంస్థలు మరో అడుగుముందుకేశాయి. ఇప్పటికే అన్ని రకాల వస్తువులను విక్రయిస్తున్న సంస్థలు..తాజాగా ఈ జాబితాలోకి బైకులు కూడా చేరాయి. మధ్యస్థాయి మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్‌కు చెందిన పలు బైకులు ఫ్లిప్‌కార్ట్‌లో కొనుగోలు చేయవచ్చును.వీటిలో బుల్లెట్ 350, క్లాసిక్ 350, హంటర్ 350, గోన్ క్లాసిక్ 350, న్యూ మీటర్ 350 వంటి మాడళ్లు ఫ్లిప్‌కార్ట్‌లో లభించనున్నాయి. ప్రస్తుతానికి ఈ బైకులు కేవలం ఐదు నగరాలు బెంగళూరు, గురుగ్రామ్, కోల్‌కతా, లఖ్నోలో మాత్రమే ఈ నెల 22 నుంచి లభించనున్నట్టు ప్రకటించాయి. బైకు కొనుగోలుతర్వాత ఆయా నగరాల్లో ఉన్న రాయల్ ఎన్‌ఫిల్డ్ డీలర్ల వద్ద సర్వీసింగ్, సేవలు పొందవచ్చునని తెలిపింది.

# స్పోర్ట్స్

## భారత్ కష్టంగా.. ఒమన్‌పై చెమటోడ్చి విజయం..

**రాణించిన శాంసన్**
**కలీమ్, మీర్జా అర్ధసెంచరీలు**

అబుదాబి
ఆసియాకప్ టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన భారత్‌కు పసికూన ఒమన్ ముచ్చెమటలు పట్టించింది. సులువైన ప్రత్యర్థినే కదా అని అలవోకగా తీసుకున్న టీమ్ఇండియా..ఒమన్‌పై చెమటోడ్చి నెగ్గింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 21 పరుగుల తేడాతో ఒమన్‌పై గెలిచింది. తొలుత టీమ్ఇండియా 20 ఓవర్లలో శాంసన్(45 బంతుల్లో 56, 3ఫోర్లు, 3సిక్స్‌లు), అభిషేక్‌శర్మ(38) రాణించడంతో 188/8 స్కోరు చేసింది. వీరికి తోడు అక్షర్‌పటేల్(26), తిలక్‌వర్మ(29) ఆకట్టుకున్నారు. ఫైజల్, జితెన్, కలీమ్ రెండేసి వికెట్లు తీశారు. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన ఒమన్ 20 ఓవర్లలో 167/4 స్కోరు చేసింది. ఆమీర్ కలీమ్(46 బంతుల్లో 64, 7ఫోర్లు, 2సిక్స్‌లు), హమ్మద్ మీర్జా(33 బంతుల్లో 51, 5ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో కదంతొక్కారు. వీరిద్దరి ధాటికి ఒక దశలో ఒమన్..భారత్‌కు షాక్ ఇస్తుందా అనిపించింది. హార్దిక్, అర్ష్‌దీప్, రానా, కుల్దీప్ ఒక్కో వికెట్ తీశారు.



**కలీమ్, మీర్జా ధనాధన్:**
టీమ్ఇండియా నిర్దేశించిన లక్ష్యఛేదన కోసం బ్యాటింగ్‌కు దిగిన ఒమన్ సాధికారిక ఆటతీరుతో ఆకట్టుకుంది. నిర్జీవమైన పిచ్‌పై పసలేని టీమ్ఇండియా బౌలింగ్‌ను అలవోకగా ఎదుర్కొంటూ ఒమన్ బ్యాటర్లు వీరవిహారం చేశారు. మరో ఓపెనర్ ఆమీర్ కలీమ్‌తో కలిసి కెప్టెన్ జతిందర్‌సింగ్(32) జట్టుకు మెరుగైన శుభారంభం అందించడంలో సఫలమయ్యాడు. గత మ్యాచ్‌ల్లో వరుసగా విఫలమవుతూ వస్తున్న జతిందర్ కెప్టెన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మరో ఎండ్‌లో కలీమ్ కూడా జత కలువడంతో ఒమన్ పవర్‌ప్లే ముగిసే సరికి 44 పరుగులు చేసింది. కుల్దీప్ 9వ ఓవర్‌లో ఎల్బీడబ్ల్యూ నుంచి కలీమ్ తప్పించుకోగా, బంతి తేడాతో జతిందర్‌సింగ్..క్లీన్‌బౌల్డ్ కావడంతో తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. ఇక్కణ్నుంచి కలీమ్, హమ్మద్ మీర్జా ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లారు.
టీమ్ఇండియా బౌలర్లను అలవోకగా ఎదుర్కొంటూ లక్ష్యాన్ని అంతకంతకు తగ్గించే ప్రయత్నం చేశారు. అప్పటికే మంచి టచ్‌లోకి వచ్చిన కలీమ్..దూబే 15వ ఓవర్‌లో సిక్స్‌తో అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ క్రమంలో బౌలర్లను మార్చిమార్చి ప్రయోగించినా టీమ్ఇండియాకు లాభం లేకపోయింది. అయితే రానా 18వ ఓవర్‌లో భారీ షాట్‌కు ప్రయత్నించినా కలీమ్..హార్దిక్ సూపర్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. దీంతో 93 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు ముగింపు పడింది. కలీమ్ ఔటైనా మీర్జా తన జోరు కొనసాగిస్తూ అర్ధసెంచరీ చేరుకున్నాడు. హార్దిక్ 19వ ఓవర్‌లో క్యాచ్ ఔట్‌తో మీర్జా మూడో వికెట్‌గా ఔటయ్యాడు.

## సెమీస్‌లో సాత్విక్ జోడీ

**సింధుకు చుక్కెదురు, చైనా మాస్టర్స్ టోర్నీ**



షెన్‌జెన్
చైనా మాస్టర్స్ టోర్నీలో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. భారత సీనియర్ షట్లర్ పీవీ సింధు క్వార్టర్స్‌లోనే నిష్క్రమించగా, స్టార్ జోడీ సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్‌శెట్టి సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ క్వార్టర్స్‌లో సాత్విక్, చిరాగ్ ద్వయం 21-14, 21-14తో చైనా జోడీ రెన్ జింగ్ యు, జీ హనోన్‌పై అలవోక విజయం సాధించింది. 38 నిమిషాల్లోనే ముగిసిన పోరులో ఎనిమిదో సీడ్ సాత్విక్, చిరాగ్ జంట వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది. ఇటీవల నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న ఈ ప్రపంచ తొమ్మిదో ర్యాంక్ జోడీ..చైనీస్ షట్లర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది.కండ్లు చెదిరే స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్, డ్రాప్‌షాట్లతో భారత యువ జంట టైటిల్‌కు మరో రెండడుగుల దూరంలో నిలిచింది. సెమీస్‌లో మలేషియాకు చెందిన ఆరోన్ చియా, సోహ్ వు యిక్‌తో సాత్విక్, చిరాగ్ తలపడుతారు. మరోవైపు మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో సింధు 14-21, 13-21తో ఒలింపిక్ చాంపియ అన్ సె సంగ్(చైనా) చేతిలో ఓటమిపాలైంది. 38 నిమిషాల్లోనే ముగిసిన పోరులో అన్‌సీడెడ్ సింధు..టాప్‌సీడ్ సంగ్‌కు ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది.

## పడిక్కల్ సెంచరీ

**భారత్ ఏ, ఆసీస్ ఏ టెస్టు డ్రా**



లక్నో
భారత్ ‘ఏ’, ఆస్ట్రేలియా ‘ఏ’ మధ్య అనధికారిక తొలి టెస్టు మ్యాచ్ ఎలాంటి ఫలితం లేకుండానే డ్రా గా ముగిసింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ఆసీస్ ‘ఏ’ వికెట్ నష్టపోకుండా 56 పరుగులు చేసింది. ఓపెనర్లు సామ్ కొన్‌స్టాస్(27 నాటౌట్), క్యాంప్‌బెల్(24 నాటౌట్) నిలకడగా రాణించారు. యువ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ(5-3-4-0) కట్టుదిట్టంగా బౌలింగ్ చేశాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 403/4తో నాలుగో రోజు తొలి ఇన్నింగ్స్‌కు దిగిన యువ భారత్ 531/7 వద్ద డిక్లేర్ చేసింది.ఓవర్‌నైట్ బ్యాటర్లు దేవదత్ పడిక్కల్(281 బంతుల్లో 150, 14ఫోర్లు, సిక్స్) సూపర్ సెంచరీతో కదంతొక్కాడు. ఆసీస్ యువ బౌలింగ్ దాడిని సమర్థంగా నిలువరిస్తూ ఫస్ట్‌క్లాస్ కెరీర్‌లో ఏడో సెంచరీని ఖాతాలో వేసుకున్నాడు. ఈ క్రమంలో ధృవ్ జురెల్(140)తో కలిసి ఐదో వికెట్‌కు 228 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కోరె రిచోలీ(3/159) మూడు వికెట్లు తీశాడు.

## 'ఓజీ' టికెట్ రేట్లు పెంపు. ప్రత్యేక ప్రీమియర్ షోకూ అనుమతి..!




పవన్ కల్యాణ్ నటించిన పాన్ ఇండియా సినిమా 'ఓజీ' టికెట్ల పెంపునకు తెలంగాణ సర్కార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సెప్టెంబర్ 25న ఈ చిత్రం విడుదల కానున్న నేపథ్యంలో టికెట్ ధరల్ని పెంచుకోవచ్చని తెలిపింది. అంతేకాదు స్పెషల్ ప్రీమియర్ షోకు అనుమతి కూడా ఇచ్చేసింది. దాంతో, పవర్ స్టార్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబర్ 24 రాత్రి 9 గంటలకు ఓజీ ప్రత్యేక ప్రీమియర్ షో వేయనున్నారు. ఈ షో టికెట్ ధర రూ. 800. సింగిల్ స్క్రీన్‌లో రూ.277, మల్టీప్లెక్స్‌లో రూ.445 వరకూ ఉండనుంది. సిసినిమా విడుదలైన పది రోజుల పాటు పెంచిన టికెట్ ధరలు వర్తించనున్నాయి. పదకొండో రోజు నుంచి సింగిల్ స్క్రీన్లలో రూ.177, మల్టీ ఫ్లెక్స్‌లో రూ.295 నుంచి టికెట్లు లభిస్తాయి. ఈమధ్యే 'హరిహర వీరమల్లు' తో ఫ్యాన్స్‌ను పలకరించిన పవన్.. ఈసారి ఓజీతో థియేటర్లలో సందడి చేయనున్నారు. 'సాహో' ఫేమ్ సుజీత్ తెరకెక్కించిన ఈ సినిమా తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

## రోజురోజుకు రెచ్చిపోతున్న ఫరియా..

### క్లివేజ్ షోతో కిక్కెక్కిస్తోందిగా

అందాల భామ ఫరియా అబ్దుల్లా గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. జాతిరత్నాలు సినిమాతో తెలుగుతెరకు పరిచయమైంది ఫరియా మొదటి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకొని చిట్టిగా కుర్రకారు గుండెల్లో నిలిచిపోయింది. మొదటి సినిమా తరువాత మంచి అవకాశాలు, విజయాలు అందుకుంటుంది అనుకున్న ఫరియా.. ఆ తరువాత పలు సినిమాల్లో నటించినా అంతటి గుర్తింపును అందుకోలేకపోయింది. గతేడాది మత్తు వదలరా 2 తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న ఈ భామ ప్రస్తుతం కొన్ని ప్రాజెక్ట్స్ తో బిజీగా మారింది. సినిమాల విషయం పక్కన పెడితే సోషల్ మీడియాలో అమ్మడి అందాల ఆరబోతకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంది. నిత్యం హాట్ హాట్ ఫొటోస్ తో చిట్టి కుర్రకారుకు కునుకు లేకుండా చేస్తోంది. తాజాగా చిట్టి గ్రీన్ కలర్ టూ పీస్ డ్రెస్ లో అందాలను ఆరబోసి సోషల్ మీడియాను హీటెక్కించింది. ఒక పక్క క్లివేజ్ షో చేస్తూ.. ఇంకో పక్క థైస్ అందాలను చూపిస్తూ రెచ్చిపోయింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.



## ఎద అందాలను వంగి మరీ చూపిస్తూ రెచ్చగొడుతున్న మిరాయ్ బ్యూటీ..

ఇష్టం సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ భామ స్టార్ హీరోలందరి సరసన నటించి స్టార్ హీరోయిన్ గా ఒక వెలుగు వెలిగింది .ఇక కెరీర్ పీక్స్ లో ఉన్నప్పుడే పెళ్లి చేసుకొని.. కొన్నేళ్ళు ఇండస్ట్రీకి గ్యాప్ ఇచ్చిన శ్రియ.. తల్లి అయ్యాక రీఎంట్రీ ఇచ్చింది. పెళ్లి అయ్యి, తల్లిగా మారాకా కూడా అంతా అందాన్ని కాపాడుకుంటూ రావడం అంటే మామూలు విషయం కాదు. ఇప్పటికీ కుర్ర హీరోయిన్లకు పోటీగా శ్రియ తన అందంతో మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. మిరాయ్ సినిమాలో శ్రియ తల్లి పాత్రలో నటించినా హీరోయిన్ కన్నా ఎక్కువ ఆమెకే ప్రశంసలు వచ్చాయి అంటే అతిశయోక్తి కాదు. ఇక సోషల్ మీడియాలో అమ్మడి అందాల అరబోతకు సపరేట్ ఫ్యాన్ బేస్ నే ఉంది. తాజాగా శ్రియ ఫ్లోరల్ డిజైనర్ డ్రెస్ లో క్లీవేజ్ షోతో హీట్ ఎక్కించింది. వంగి మరీ ఎద అందాలను చూపిస్తూ కుర్రకారును రెచ్చగొట్టేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## గీతా ఆర్ట్స్ మహాభారతం?



గీతా ఆర్ట్స్ సంస్థ ప్రస్తుతం మహాభారతంపై దృష్టి పెట్టింది. అత్యంత భారీగా మూడు భాగాల్లో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మించేందుకు అల్లు అరవింద్ ప్రణాళికలు రచిస్తున్నట్టు ఫిల్మ్ వర్గాల టాక్. దీనికోసం కొంతమంది రచయితలతో చర్చలు కూడా జరిగాయని తెలిసింది. మహాభారతాన్ని లోతుగా అధ్యయనం చేసి, అందులోని ఆసక్తికరమైన అంశాలను వెలికితీసేందుకు ఓ టీమ్ ఇప్పటికే పనిచేస్తున్నదని సమాచారం. మహాభారత కథాంశంతో ఇప్పటికే చాలా సినిమాలొచ్చాయి. అయితే ఈ సారి అర్జునుడి కోణంలో కథను చెప్పే ప్రయత్నం చేస్తున్నారట. అర్జునుడిగా అల్లు అర్జున్ కనిపించే అవకాశం ఉంది. బన్నీతోపాటు పాన్ ఇండియాలో ప్రధానమైన కొందరు తారలు కూడా ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగం అయ్యే అవకాశం ఉంది. అయితే.. ఈ సినిమాను ఎవరు డైరెక్ట్ చేస్తారు? అనే విషయంపై మాత్రం క్లారిటీ లేదు. అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి జీవితాశయం మహాభారతం. ఆయనే అదృశ్యంగా ఉండి కథంతా నడిపిస్తున్నట్టు కూడా ఓ టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తున్నది. ఆ అవకాశాన్ని కూడా లేకపోలేదు. ఒకవేళ రాజమౌళి ఆలోచన వేరేలా ఉంటే.. గీతా ఆర్ట్స్ మరో దర్శకుడ్ని చూసుకోవాల్సిందే. ఇంతకీ ఈ మహాభారతానికి దర్శకుడెవరో?

## కల్కి-2 నుంచి తప్పుకున్న దీపిక



ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కల్కి 2898 ఏడీ' పార్ట్-2 నుంచి దీపక తప్పుకున్నారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం భారతీయ సినిమాకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చి ఎన్నో అవార్డులను సొంతం చేసుకుంది. దీనికి సీక్వెల్ ఉన్నట్లు- ఇప్పటికే చిత్రబృందం వెల్లడించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ మూవీ టీమ్ సడెన్ షాక్ ఇచ్చింది. దీని సీక్వెల్‌లో దీపికా పదుకొణె నటించడం లేదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ నిర్మాణ సంస్థ పోస్ట్ పెట్టింది. 'కల్కి' సీక్వెల్‌లో దీపిక భాగం కాదని అధికారికంగా తెలియజేస్తున్నాం. తొలి భాగం కోసం ఆమెతో సుదీర్ఘ ప్రయాణం చేసినప్పటికీ రెండో పార్ట్‌లో భాగస్వామి కాలేకపోయింది. గొప్ప టీమ్‌తో కల్కి సీక్వెల్ మీ ముందుకు వస్తుంది. భవిష్యత్తులో దీపిక మంచి సినిమాలతో అలరించాలని కోరుకుంటున్నాం అని వైజయంతీ మూవీస్ పోస్ట్ పెట్టింది. నిర్మాణ సంస్థ ప్రకటనతో అభిమానులు షాక్ అవుతున్నారు. గత కొన్ని రోజులుగా దీపికా పేరు నిత్యం సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్న విషయం తెలిసిందే. ఇటీ-వల ఆమె ఓ భారీ ప్రాజెక్ట్ నుంచి వైదొలగినట్లు- కూడా వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ భారీ అప్‌కమింగ్ సినిమా నుంచి ఆమె వైదొలగడం చర్చనీయాంశంగా మారింది.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492